PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 338 | విజయవాడ, ఆదివారం 9 జులై 2023 | 6 + 8 పేజీలు + స్నేహ | వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 9 July 2023 | Rs

దేశంలో తగ్గిన ఇళ్ల అమ్మకాలు

- ప్రథమార్థంలో 3% పెరిగిన వాణిజ్య లీజింగ్ స్థలాలు
- నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్

లోపలి పేజీలో..

ప్రీమియం చెల్లించిన మరుక్షణమే బీమా

ప్రజాశక్తి-అమరావతి

వాహనాలకు బీమా ప్రీమియం డబ్బు చెల్లించిన మరుక్షణమే ప్రమాద బీమా అమలవుతుందని హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రీమియం సొమ్ము చెల్లించిన కొద్ది గంటల్లోనే ప్రమాదం జరిగిందని చెప్పి ప్రమాద బీమా డబ్బు చెల్లించబోమంటే కుదరదని జస్టిస్ డి వెంకట రమణ తీర్పు చెప్పారు. ప్రీమియం డబ్బు చెల్లించిన తర్వాత రోజు నుంచి ప్రమాద బీమా అమలవుతుందంటూ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ చేసిన వాదనను కొట్టేసింది. జి రత్నమ్మ అనే మహిళను నెల్లూరులో ఒక కారు 2000 సంవత్సరంలో ఢీకొంది. ఆమెకు రూ.30 వేలు పరిహారం చెల్లించాలని ట్రిబ్యునల్ 2004లో తీర్పు చెప్పింది. దీనిని బీమా కంపెనీ నెల్లూరు డిఎం హైకోర్టులో సవాల్ చేశారు. కారుకు బీమా చేసిన రోజునే రోడ్డు ప్రమాదం జరిగిందని, బీమా వర్తించేది ఆ తర్వాత రోజు నుంచేనని బీమా కంపెనీ చేసిన వాదనను హైకోర్టు కొట్టేసింది. ట్రిబ్యునల్ రూ.30 వేలుగా నిర్ణయించిన పరిహారాన్ని రూ.లక్షకు పెంచింది. ఈ మొత్తాన్ని కారు యజమాని, బీమా కంపెనీలు చెల్లించాలంది.

బాదుడే బాదుడు

- యూనిట్‌కు మరో రూ.1.20 పైసలుకు పైగా వడ్డనకు రంగం సిద్ధం
- రూ.2000 కోట్ల ట్రూఅప్ భారం పడే ప్రమాదం
- ఒక బిల్లులో రెండు ట్రూఅప్‌లు, రెండు ఎఫ్‌పిపిసిఎలు
- వచ్చే నెల నుండి అమల్లోకి వచ్చే అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో విద్యుత్ భారాల దెబ్బకు పారిశ్రామిక రంగం కుదేలవుతోంది. ఇప్పటికే ఒక ట్రూఅప్‌తోపాటు రెండు ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్) విధిస్తున్న ప్రభుత్వం కొత్తగా మరో ట్రూఅప్‌కు సిద్ధమవుతోంది. అంటే రెండు ట్రూఅప్‌లు, రెండు పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్ భారాలు పడనున్నాయి. 2014తోపాటు ఈ ఏడాది ఏప్రిల్ నెల అడ్జస్ట్‌మెంట్‌ను కూడా వసూలు చేస్తున్న ప్రభుత్వం రాబోయే రెండు మూడు నెలల్లో యూనిట్‌కు మరో రూ.1.20 పైసలు భారం విధించేందుకు రంగం సిద్ధం చేసింది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సామాన్యులతోపాటు, పరిశ్రమల యజమానులూ ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఆరుపైసల నుండి రూ.0.96 పైసలకు పెంచి దాన్ని రూపాయి నికరం చేయడంతో 1.70 లక్షల యూనిట్లువాడే పరిశ్రమలపై రూ.1.70 లక్షల అదనపు భారం పడుతోంది. ఇది కాకుండా 2014-19 ట్రూప్ అప్ కూడా వసూలు చేయడం మరో భారం. చాలదన్నట్లు ఎప్పటి ఖర్చులు అప్పుడే వసూలు చేసుకోవాలని కేంద్రం ఇచ్చిన సూచనల్లో భాగంగా 2021, 2023కు సంబంధించి పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్ ఛార్జీలు ఎప్పటికప్పుడు వసూలు చేస్తున్నారు. అంటే సాధారణ బిల్లు కాకుండా మూడు రకాల అదనపు భారాలు మోపారు. డ్యూటీతో కలిపితే నాలుగోది. కస్టమర్, ఫిక్స్‌డ్ ఛార్జీలు అదనం. ఇప్పుడు కొత్తగా 2019 నుండి 2022 వరకూ మరో ట్రూ అప్ వసూలు చేసేందుకు అవసరమైన కసరత్తులు పూర్తయ్యాయి. ఇది సుమారు రూ.2000 కోట్లపైబడి మోపే అవకాశం ఉంది. ఈ మొత్తాన్ని ఈ ఏడాది ఆగస్టు నెల బిల్లు నుండి వసూలు చేసే అవకాశం ఉందని, కేంద్రం సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

బిల్లుల్లోనూ తకరారు

ప్రస్తుతం విద్యుత్‌శాఖ కిలోవాట్ అవర్ (కెడబ్ల్యుహెచ్) కింద కొనుగోలు చేస్తోంది. దీన్ని వినియోగదారులకు కిలో వోల్ట్ యాంపియర్ (కెవిఎహెచ్) కింద సరఫరా చేస్తోంది. దీనివల్ల యూనిట్ల వినియోగం పెరుగుతుంది. గతంలో పరిశ్రమలకు కిలోవాట్ అవర్ కింద సరఫరా చేసే వారని, ఇప్పుడు కిలోవోల్ట్స్ యాంపియర్ అవర్ కింద సరఫరా చేస్తుండటం వల్ల అదనపు బిల్లులు పడుతున్నాయని పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పవర్ ఫ్యాక్టర్ భారం కూడా ఎక్కువగా పడుతోందని చెబుతున్నారు. గతంలో లాగ్, లీడ్ ఉండేవని కంపెనీకి సరఫరా అయ్యే విద్యుత్ కేటాయింపునకు మించి పెరిగితే ఆటోమేటిక్‌గా బిల్లు పడేదని చెబుతున్నారు. ప్రస్తుతం పరిశ్రమ నడవని సందర్భంలో సప్లయి అదనంగా వస్తే దానికి కెపాసిటర్లో రికార్డు చేసి బిల్లు వేస్తున్నారని, వాడని విద్యుత్‌కూ బిల్లు కట్టాల్సి వస్తోందని యజమానులు వాపోతున్నారు.

అదనపు భారం ఇలా

ప్రస్తుతం విజయవాడలో ఓ పరిశ్రమ నెలకు 1.70 లక్షల యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తోంది. దీనికి యూనిట్‌కు మిగతా 5లో

బడికి పంపకపోతే పథకాలు కట్

- ఈ నెలాఖరుకు నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్
- విద్యాశాఖ సమీక్షలో సిఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడిఈడు పిల్లలను బడికి పంపకపోతే పథకాలు అందవని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులకు ఈ సందేశాన్ని తెలియజేసి పిల్లలందరినీ బడికి పంపేలా చూడాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖపై విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం సిఎస్ సమీక్ష నిర్వహించారు. వలంటీర్ల ద్వారా చేపట్టిన నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చిన మరుగుదొడ్లను వినియోగించని పాఠశాలలు, సంబంధిత మండల విద్యాశాఖ అధికారులపై చర్యలకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద చేపట్టిన పనులను డిసెంబరు, జనవరి నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యార్థుల్లో రక్తహీనతను నివారించేందుకు ఐరెన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేయడంతోపాటు మధ్యాహ్న భోజన పథకంలో మరింత పౌష్టికత ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీయాలని, మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. క్రీడా పరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి మండల కేంద్రాలు, పెద్ద గ్రామ పంచాయతీల్లోని రెండెకరాల విస్తీర్ణం ఉన్న పాఠశాలలను గుర్తించాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం జూనియర్ బాలికల కళాశాలతో కలిపి మండలానికి రెండు కళాశాలలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సర్టిఫికెట్లను విద్యార్థులు డిజి లాకర్ విధానంలో భాగంగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిపై సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక మిగతా 2లో

మాది రైతు పక్షపాత ప్రభుత్వం

వ్యవసాయానికి మరో 30 ఏళ్లు ఉచిత విద్యుత్

- పంటల కొనుగోలులో దళారీ వ్యవస్థ లేకుండా చేశాం
- రైతు దినోత్సవ సభలో ముఖ్యమంత్రి జగన్
- బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో పంటల బీమా డబ్బు జమ

పంటల బీమా నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

వ్యవసాయానికి మరో 30 ఏళ్లు ఉచిత విద్యుత్‌ను గ్యారెంటీ చేసే విధంగా చర్యలు తీసుకున్నామని, ఈ మేరకు సెకీతో ఒప్పందాలు చేసుకున్నామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, పంటల కొనుగోళ్లలో దళారీ వ్యవస్థ లేకుండా చేశామని అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో శనివారం జరిగిన రైతు దినోత్సవంలో ఆయన పాల్గొని ఉచిత పంటల బీమా పంపిణీ కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10.20 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1,117 కోట్లు పంటల బీమా డబ్బులు జమచేశారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి విచ్చేసిన ముఖ్యమంత్రి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కళ్యాణదుర్గం చేరుకున్నారు. వేదికపై వచ్చి వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కొంతసేపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో వ్యవసాయ రంగంలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను వివరించారు. యూనిట్‌కు రూ.2.45 చొప్పున రాబోయే 30 ఏళ్లు ఇదే ధరతో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించే విధంగా సెకీతో ఒప్పందం కుదిర్చినట్టు తెలిపారు. తద్వారా రాబోయే ముప్పయి ఏళ్లు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ గ్యారెంటీ చేశామన్నారు. ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి పంటల కొనుగోళ్లలో దళారీ వ్యవస్థ లేకుండా చేశామన్నారు. ధాన్యం కొనుగోలుకు రూ.58 వేల కోట్లు ఖర్చు పెట్టామని, ఇతర పంటలకు రూ.7,633 కోట్లు నిధులు వెచ్చించామని తెలిపారు. టిడిపి అధికారంలో ఉన్న ఐదేళ్లలో సగం రాష్ట్రం కరువులోనే ఉండేదని, ఆ సమయంలో రైతులను ఆదుకోవడానికి అప్పటి ప్రభుత్వం ఖర్చు పెట్టింది రూ.3,411 కోట్లు మాత్రమేనని అన్నారు. తాము అధికారంలో ఉన్న నాలుగున్నరేళ్లలో ఒక్క కరువు మండలం కూడా లేదని తెలిపారు. అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు రూ.7,802 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో వ్యవసాయ రంగానికి మొత్తం రూ.2.06 లక్షల కోట్ల ఖర్చు పెట్టామని తెలిపారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనాలు ఏమి కావాలన్నారు. త్వరలో జరగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో ఎటువైపు నిలబడతారో ఆలోచించుకోవాలని ప్రజలను కోరారు. మంచి చేసే వారు కావాలో? మాయమాటలు చెప్పి మోసం చేసే వారు కావాలో? ఆలోచించి నిర్ణయించుకోవాలని సూచించారు. ప్రజలకు ఏ మంచి చేయాలనుకున్నా దుష్టచతుష్టయం అడ్డుపడుతోందని విమర్శించారు. ఇటువంటి వారి మాటలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'అనంత'లో ముందస్తు అరెస్టులు

- జెసి.ప్రభాకర్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు గృహ నిర్బంధం
- శుక్రవారం రాత్రి నుంచే సిపిఎం నాయకుల అరెస్టు

లోపలి పేజీలో...

బెంగాల్ పంచాయతీ ఎన్నికలు రక్తసిక్తం

ఇద్దరు సిపిఎం కార్యకర్తలతో సహా 18 మంది బలి ● ప్రజాస్వామ్యం అపహాస్యం: బిమన్ బసు

పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణాలు జిల్లాలో బరసత్‌లో స్వతంత్ర అభ్యర్థిని హత్య చేయడాన్ని నిరసిస్తూ రహదారిని దిగ్బంధించిన ఆయన మద్దతుదార్లు

కొల్‌కతా: పంచాయతీ ఎన్నికలు ప్రహసనంగా మారాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్ దుండగులు యథేచ్ఛగా బూత్‌ల ఆక్రమణకు పాల్పడడంతో పలు చోట్ల హింస చెలరేగింది. పోలింగ్ ముగియడానికి ముందే రాష్ట్ర వ్యాపితంగా 18 మంది బలయ్యారు. వీరిలో సిపిఐ(ఎం)కు చెందిన ఇద్దరు కార్యకర్తలు ఉన్నారు. తృణమూల్ దాడులు, దౌర్జన్యాల నడుమ శనివారం సాయంత్రం 5 గంటల వరకు 66.28 శాతం ఓట్లు పోలైనట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. ఓట్ల లెక్కింపు ఈ నెల 11న నిర్వహించనున్నారు.

కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలు మోహరించినప్పటికీ ఎన్నికల్లో పెద్దయెత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్లు సిపిఐ(ఎం), కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. తృణమూల్ ఆగడాలను అడ్డుకోవడానికి యత్నించిన ప్రతిపక్ష పార్టీలపై మారణాయుధాలతో అధికార పార్టీ దుండగులు దాడి చేశారు. భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ఎన్నికల సంఘం చోద్యం చూసిందే తప్ప అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి ముఖ్యమంత్రి మమత బెనర్జీయే బాధ్యత వహించాలని లెఫ్ట్ ఫ్రంట్ నేత బిమన్ బసు పేర్కొన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేయడానికి వెళ్లిన సిపిఐ(ఎం) కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా బిమన్ బసు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో పెద్దయెత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని విమర్శించారు. రిగ్గింగ్ జరిగిన చోట రీపోలింగ్ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం వెంటనే తగు చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తృణమూల్ దాడుల్లో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారిని ఆయన పరామర్శించారు.

జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు

- అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత

జమ్ము-శ్రీనగర్ హైవేలో సొరంగం మార్గం వద్ద కుంగిన రహదారి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాల కారణంగా వరుసగా రెండో రోజునా అమర్‌నాథ్ యాత్ర నిలిచిపోయింది. జమ్ము- శ్రీనగర్ హైవేపై కొండ చరియలు విరిగిపడ్డంతో పహల్గాం, బల్తాల్ రెండు మార్గాల్లోనూ శనివారం యాత్రను నిలిపివేశారు. దారి మధ్యలో చిక్కుకునిపోయిన యాత్రికులను భారత సైన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. బరారీ మార్గ్ క్యాంపులో 253 మంది యాత్రీకులు, చందన్‌వారీ క్యాంపులో 126 మంది యాత్రికులను సురక్షితంగా ఉంచినట్లు ఆర్మీ ప్రతినిధి ఒకరు తెలిపారు. యాత్రీకులకు అవసరమైన సహాయాన్ని భారత సైన్యం అందిస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలకు తోడు, ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పడిపోయినట్లు చెప్పారు. వేలాది మంది యాత్రీకులు వివిధ ప్రదేశాల్లో చిక్కుకునిపోయినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల నుంచి యాత్రీకులు కూడా కొందరు ఉన్నారు. నువ్వాన్ బేస్, భగవతి నగర్ బేస్ క్యాంపు, పంచతర్ణి క్యాంపుల్లో వీరు తలదాచుకున్నారు. ఒక్క పంచతర్ణి క్యాంపులోనే దాదాపు 1500 మంది వరకూ యాత్రీకులు ఉన్నారు. మరోవైపు, జమ్ము నుంచి కాశ్మీర్ లోయకు వెళ్లేందుకు కొత్త యాత్రీకులనెవరిని అధికారులు అనుమతించడం లేదు. చందర్‌కోట్ ప్రాంతంలోని రాంబన్ యాత్రి నివాస్ క్యాంపు వద్ద సుమారు 4,600 మంది యాత్రీకులు చిక్కుకున్నారు. కొండచరియలు విరిగిపడ్డంతో శ్రీనగర్-జమ్ము జాతీయ రహదారిని అధికారులు మూసివేశారు. దీంతో హైవేపై దాదాపు 600 వాహనాలు నిలిచిపోయాయి. జమ్ముకాశ్మీర్‌లో గత మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ భారీ వర్షాలకు వరదలతో పాటు కొండచరియలు కూడా విరిగిపడుతున్నాయి. ఈ నెల 1న అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమయింది. ఆగస్టు 31న ముగుస్తుంది.

సిపిఎం నాయకులు మురాల రాజేష్ ఇకలేరు

ప్రజాశక్తి- గుడివాడ

సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మురాల రాజేష్ (35) శుక్రవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యులుగా, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శిగా కూడా ప్రస్తుతం ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కిడ్నీ వ్యాధి సోకడంతో గత కొంతకాలం నుండి చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి అస్వస్థతకు గురై కన్నుమూశారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలం ఉనికిలి గ్రామంలో ఆయన నివాసం ఉంటున్నారు. పెత్తందారులు, భూస్వాములు ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా, కేసులు పెట్టించి జైలులో పెట్టినా లెక్క చేయకుండా పోరాటాలు సాగించారు. అవివాహితుడైన ఆయనకు తల్లిదండ్రులు మురాల భిక్షం, మరియమ్మ, ఒక సోదరుడు, ముగ్గురు సోదరీమణులు ఉన్నారు. అశ్రునయనాల మధ్య ఉనికిలిలో శనివారం అంత్యక్రియలు జరిగాయి.

కడపలో ఘోరం

- రోడ్డు ప్రమాదంలో రవాణా అధికారి దుర్మరణం
- తనిఖీలు నిర్వహిస్తుండగా దూసుకెళ్లిన లారీ

శివప్రసాద్ (ఫైల్)

ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ప్రజాశక్తి- చెన్నూరు

కడప జిల్లా చెన్నూరు మండల శివారులోని ఆలంఖాన్‌పల్లె సర్కిల్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ (54), ఆయన సహాయకుడు కేశవులు (35) మృతి చెందారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండడంగా ఈ ఘటన చోటు చేసుకుంది. గుజరాత్ నుంచి తిరుపతికి టైల్స్ తీసుకెళుతున్న లారీ అతివేగంగా వచ్చి ఆలంఖాన్‌పల్లె వద్ద డివైడర్‌ను, అనంతరం పక్కనే ఉన్న ఎంవిఐ కారును ఢీకొట్టింది. దీంతో, వీరిద్దరూ మృతి చెందారు. చెన్నూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఎంవిఐ శివప్రసాద్ స్వగ్రామం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ అని, కేశవులు స్వగ్రామం కమలాపురం నియోజవర్గం చింతకొమ్మదిన్నె మండలం ఊటూకూరని పోలీసులు తెలిపారు. రిమ్స్‌లో మృతదేహాలను ఆర్‌టిఒ కార్యాలయ అధికారులు సందర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఢిల్లీ వరకు కెసిఆర్ అవినీతి పాకింది

- వరంగల్ సభలో ప్రధాని మోడీ

5

ఇపిడిసిఎల్ బుకాయింపు

- 'ప్రజాశక్తి' కథనంపై సిజిఎం వివరణ
- 'ఉచితంపై వేటు' కథనంలో లేని అంశాలతో పోలిక

2

దేశభక్తి పేరుతో ద్రోహం

- మోడీ కార్పొరేట్ విధానాలను ప్రతిఘటించండి
- బెఫి 8వ మహాసభలో ఎంఎ గపూర్
- బెఫి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా వేణుగోపాల్, అజయ్‌కుమార్

బెఫి మహాసభలో ప్రసంగిస్తున్న ఎంఎ గపూర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ఉద్యోగ, కార్మిక ఉద్యమాలకు క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, హక్కులను పరిరక్షించుకునేందుకు ఉద్యోగం, ఉద్యమం అనే నినాదంతో బ్యాంకు ఉద్యోగులు ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గపూర్ పిలుపునిచ్చారు. దేశంలో ఈ తొమ్మిదేళ్ల కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం సామాన్య ప్రజలను పణంగా పెట్టి కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెడుతోందని, ఇదేమిటని ప్రశ్నిస్తే దేశద్రోహులు అనే ముద్ర వేస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం దేశభక్తి పేరుతో దేశద్రోహం పనులు చేస్తోందని అన్నారు. శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫి) 8వ రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ మహాసభలో ఎంఎ గపూర్ ప్రారంభోపన్యాసం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం దేశం కార్పొరేట్‌ల మీద ఆధారపడకూడదని బలమైన ప్రభుత్వరంగాన్ని నిర్మించుకుంటే మోడీ ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రజల త్యాగాలతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటుపరం చేయడం, అలా సాధ్యం కాకపోతే అమ్మేస్తామని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వరంగంలోని పారిశ్రామిక, ఫైనాన్షియల్ సంస్థలను కేంద్ర ప్రభుత్వం పూర్తి సంక్షోభంలోకి నెట్టేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన సేవలు అందిస్తున్న జాతీయ బ్యాంకులను కేంద్రం సంస్కరణల పేరుతో నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. దేశంలో ఇప్పటికే విమానయానం, ఎయిర్‌పోర్టులు, పోర్టులు, బొగ్గు గనులను ప్రైవేటీకరించారని, ఇప్పుడు బ్యాంకింగ్ రంగంపై దృష్టి సారించారని అన్నారు. బలమైన ఉద్యోగ, కార్మిక ఉద్యమాలు రాకుండా లేబర్ కోడ్‌ల పేరుతో ఉద్యోగులకు వున్న హక్కులను మోడీ ప్రభుత్వం తొలగించిందని తెలిపారు. బ్యాంకు ఉద్యోగులు ప్రజల మద్దతును కూడగట్టి బ్యాంకింగ్ రంగాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బెఫి జాతీయ ప్రధాన కార్యదర్శి దేబశిష్ బసు చౌదురి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 2007, 2008 తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో దాదాపు అన్ని దేశాల్లో ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతోపాటు, పెద్దపెద్ద బ్యాంకులు మూతపడ్డా దేశంలోని బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగం మిగతా 5లో

మామిడి గౌరు కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

- ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైన విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం ఆరికతోటకు చెందిన గ్రీన్ అంబాసిడర్ మామిడి గౌరు కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి వెంకటరామయ్య, కె ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు నాలుగు నెలల నుంచి 22 నెలల వరకు బకాయిలు ఉంటున్నాయని, కనీసం ఆరు నెలల జీతాలైనా ఇప్పించాలని మామిడి గౌరు పంచాయతీ అధికారులను కోరినప్పటికీ స్పందించలేదన్నారు. మనోవేదనతో మనస్థాపానికి గురైన ఆయన తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడడంతో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రీన్ అంబాసిడర్లకు, గ్రామ పంచాయతీ కార్మికులకు, టైమ్‌స్కేల్ సిబ్బందికి 2 నుంచి 14 నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బకాయిలను తక్షణమే చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని వెంకటరామయ్య, ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్రజాధనం దుర్వినియోగం

- సంక్షోభంలో రైతాంగం, వ్యవసాయం
- టిడిపి నేతలు విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతు దినోత్సవం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని టిడిపి నేతలు విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనంత కష్టాల్లో రైతాంగం ఉందని శాసనమండలి ప్రతిపక్ష నేత, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకుంది శూన్యమని ఆరోపించారు. పండిన పంటకు ధర లేదని, అమ్మితే ఖాతాల్లో డబ్బులు పడవని విమర్శించారు. సకాలంలో మార్కెట్ ఇంటర్వెన్షన్, ఇన్‌పుట్ సబ్సిడీ, విపత్తు సాయం లేదని, పంట బీమా రాదని, డ్రిప్ సబ్సిడీ ఎగ్గొట్టారని విమర్శించారు. 4 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గడం సిఎం వైఫల్యమేనన్నారు. జగన్ అసమర్థ పాలన రైతాంగాన్ని, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టిందని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. తాడిపత్రి ఎమ్మెల్యే రూ.14 లక్షల పంటల బీమా సొమ్ము కాజేశారని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆరోపించారు. ప్రభుత్వ సాయం, పథకాలు పొందే రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ఎందుకు ప్రదర్శించరని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయటం లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. రైతులు క్రాఫ్ హాలిడే ఇస్తామంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలో జరిగిన ఎస్‌టియు కౌన్సిల్ సమావేశంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. వారంలో సిపిఎస్ రద్దు చేస్తానని సిఎం హామీ ఇచ్చారని, నాలుగేళ్లు గడిచినప్పటికీ హామీ నెరవేర్చలేదని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చకుండానే రాజస్థాన్, పంజాబ్, చత్తీస్‌గఢ్, హిమచల్‌ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు ఒపిఎస్‌ను అమలు చేస్తున్నాయని తెలిపారు. నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా తీసుకొచ్చిన జిఓ 117 బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేసే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జిఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయిశ్రీనివాస్, హెచ్ తిమ్మన్న మాట్లాడుతూ.. కెజిబివి ఉపాధ్యాయులకు ఎంటిఎస్ విధానాన్ని అమలు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ నిబంధనలను రూపకల్పన చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 కింద జీతాలు చెల్లించాలని, ఉమ్మడి సర్వీస్ సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

'అనంత'లో ముందస్తు అరెస్టులు

- జెసి.ప్రభాకర్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు గృహ నిర్బంధం
- శుక్రవారం రాత్రి నుంచే సిపిఎం నాయకుల అరెస్టు

రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో ఉన్న సిపిఎం నాయకులు

కాలవ శ్రీనివాసులు ధర్నాను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - అనంతపురం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా అనంతపురం జిల్లాలో ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాల పర్వం కొనసాగింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు సిపిఎం, టిడిపి నాయకులను అరెస్టు చేశారు. కార్మికులు, రైతుల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని దీనిని నిరసిస్తూ ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని సిపిఎం, సిఐటియు నాయకులు ముందుగానే ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సిపిఎం, సిఐటియు నేతలను శుక్రవారం రాత్రి నుంచే పోలీసులు గృహ నిర్బంధించారు.

శనివారం ఉదయం కూడా రాయదుర్గం, ఉరవకొండలో సిపిఎం, సిఐటియు నాయకులను అరెస్టు చేసి పలుస్టేషన్లకు తరలించారు. ముఖ్యమంత్రి పర్యటన అనంతరం వారిని విడుదల చేశారు. ఈ అక్రమ అరెస్టులను సిపిఎం జిల్లా నాయకులు తీవ్రంగా ఖండించారు.

తాడిపత్రిలో జెసి.. రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు

నీటి ప్రాజెక్టుల పూర్తి, కృష్ణా జలాల తరలింపు, గుంతకల్లు రిజర్వాయర్ పనులపై రాష్ట్ర ప్రభుత్వపు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాయదుర్గం పట్టణంలో నిరసనకు యత్నించారు. వినాయక కూడలి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టిడిపి కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టారు.

అక్కడి నుంచే ముఖ్యమంత్రికి ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. రూ.14 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అక్రమంగా పొందారని, వాస్తవాలతో తాను బయటపెడతానంటూ తన స్వగ్రామమైన పుట్లూరు మండలం తిమ్మంపల్లికి బయలుదేరేందుకు జెసి.ప్రభాకర్‌రెడ్డి సిద్ధమయ్యారు. అయితే పోలీసులు తాడిపత్రిలోని జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటిని చుట్టుముట్టి ఆయనను గృహ నిర్బంధంలో ఉంచారు.

రాష్ట్రంలో రోజుకో ఘోరం : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రోజుకో ఘోరం, ప్రతిచోటా ప్రభుత్వ టెర్రిరజం జరుగుతుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. కానిస్టేబుల్ సస్పెన్షన్, పెన్షన్ అడిగిన మహిళపై కేసు, వస్త్ర వ్యాపారులపై వైసిపి రౌడీల దాడి ఘటనలను ఖండిస్తూ శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బకాయిలు చెల్లించాలని కోరినందుకు ధర్మవరానికి చెందిన చేనేత వస్త్ర వ్యాపారులపై విజయవాడలో వైసిపి గూండాలు అమానుష దాడికి పాల్పడ్డారని, బాధితులను నగ్నంగా వీడియోలు తీసి వకృతానందం పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు వేయాలని ఉపముఖ్యమంత్రిని అడిగిన పాపానికి చిత్తూరు జిల్లాలో దళిత వర్గానికి చెందిన కానిస్టేబుల్‌పై కేసుల పెట్టి సస్పెండ్ చేశారని తెలిపారు.

ప్రకాశం జిల్లాలో పింఛను డబ్బు అడిగిన వితంతు మహిళపై కేసు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీస్‌శాఖను వైసిపి అనుబంధ విభాగంగా మార్చిన దుస్థితే ఈ పరిస్థితికి కారణమని విమర్శించారు. ఈ వైసిపి ప్రభుత్వ పాపాలకు ప్రజలు తిరుగులేని గుణపాఠం చెప్పడం ఖాయమని పేర్కొన్నారు.

ఇపిడిసిఎల్ బుకాయింపు

- 'ప్రజాశక్తి' కథనంపై సిజిఎం వివరణ
- 'ఉచితంపై వేటు' కథనంలో లేని అంశాలతో పోలిక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'ఉచితంపై వేటు' శీర్షికన 7-7-23న ప్రజాశక్తి ప్రధాన సంచికలో వచ్చిన కథనానికి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) బుకాయిస్తూ వివరణ ఇచ్చింది. కథనంలో లేని విషయాన్ని ప్రస్తావించి ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాల సర్వీసులు తగ్గలేదని చెప్పే ప్రయత్నం చేసింది. ఇపిడిసిఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల్లో నెలకు రెండు వందల యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులు 2021-22 నాటికి 8,16,585 మంది ఉండగా, 2022-23 నాటికి 6,75,125కు తగ్గినట్లు ప్రజాశక్తి తన కథనంలో పేర్కొంది. ఉచిత సర్వీసులను తగ్గించుకొనేందుకు విధించిన నిబంధనలు వల్ల 2022-23లో 1,41,460 కుటుంబాలు ఉచిత విద్యుత్‌కు దూరమైనట్లు కథనం ఇచ్చింది. దీనిపై ఎపిఇపిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (రెవెన్యూ) ఎ.వెంకటేశ్వరరావు వివరణ ఇస్తూ... కథనంలో ప్రస్తావించని 2018-19లో 5,86,307 సర్వీసులకు, 2022-23 నాటికి వున్న 6,75,125 సర్వీసులకు పోల్చిచూసి, గత ఐదేళ్లలో లబ్ధిదారుల సంఖ్య రెండు లక్షలకు పెరిగిందని తెలిపారు. 2021-22 కంటే 2022-23 నాటికి తగ్గిన 1,41,460 లబ్ధిదారుల విషయంపై సరైన సమాధానమివ్వలేదు.

అర్హత కలిగిన కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, అనర్హులను మాత్రమే లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించామని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు కాలనీ, తండాల్లోనే కాకుండా అర్హత పత్రాలను సంబంధిత గ్రామ సచివాలయాల్లో అందజేస్తే ఉచిత విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవడంలేదని, 2017-18లో రూ.52.04 కోట్లు ఉన్న సబ్సిడీ 2022-23 నాటికి రూ.189.17 కోట్లకు పెరిగిందని తెలిపారు.

అనుమానాస్పదంగా గిరిజన యువకుడి మృతి

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

కొండలరావు (ఫైల్‌ఫొటో)

గిరిజన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. దేవపురం పంచాయతీ డి.కొత్తూరు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కొండపల్లి కొండలరావు (22) తన తల్లి, సోదరుడితో కలిసి నివసిస్తున్నారు. వారి ఇంటికి సమీపంలో రామకృష్ణ, లక్ష్మి దంపతులు ఉంటున్నారు. తన చెయ్యి కొండలరావు పట్టుకున్నాడని ఆరోపణలు చేస్తూ ఊరందరికి లక్ష్మి చెప్పసాగింది. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి గొడవ జరిగినట్టు తెలుస్తోంది. దీంతో నాటు తుపాకీతో కొండలరావు అడవిలోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే గ్రామంలో తుపాకీ పేలిన శబ్దం వినిపించింది. గ్రామస్తులు వెళ్లి చూడగా అప్పటికే తూటా తగిలి కొండలరావు మృతి చెందాడు. మిస్ ఫైర్ అయి ఇలా జరిగిందా ? లేక ఎవరైనా చంపేశారా ? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రజల హృదయాల్లో వైఎస్సార్‌ది చెరగని ముద్ర

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతిని తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున, ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతా రెడ్డితో కలిసి కేక్ కట్ చేసి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు. పెద్దసంఖ్యలో యువత రక్తదానం చేసింది. అలాగే పేదలకు వస్త్రదానం చేశారు. అలాగే వైఎస్‌ఆర్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన వైఎస్‌ఆర్ జయంతిని నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి ఆధ్వర్యాన పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

రాహుల్ నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నివాళులర్పించారు. ఈ మేరకు శనివారం రాహుల్ గాంధీ ట్విట్టర్ లో పేర్కొన్నారు. "కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయనకు నా నివాళులు. ఆంధ్రప్రదేశ్ ప్రజల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనికత కలిగిన నాయకుడు. ఎప్పటికీ గుర్తుంచుకోదగిన వ్యక్తి" అని రాహుల్ గాంధీ ట్విటర్ వేదికగా తెలిపారు.

అభిమానులతో సెల్ఫీ దిగుతున్న లోకేష్

ఉప్పు రైతులను ఆదుకుంటాం

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జగన్ పాలనలో ఉప్పు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉప్పు రైతులను ఆదుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర శనివారం నెల్లూరు జిల్లా కావలి నియోజవర్గంలోని అల్లూరు క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభమైంది. అల్లూరు పోలేరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోగులపల్లి, సింగంపేట, తూర్పు గోగులపల్లి, ఊడిపిగుంట, ఊదూరుగుంట, ఎర్రప్పగుంట, తాటిచెట్లపాళెం, బంగారుపాళెం ప్రాంతాల్లో పాదయాత్ర సాగింది. అల్లూరు మండలం ఇస్కపల్లిలో ఉప్పు రైతులతో లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉప్పు సాగు చేస్తున్న రైతులకు కనీసం సాయం అందడం లేదన్నారు. విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ఉప్పు రైతులను కోలుకోలేని దెబ్బ తీశారన్నారు. పండించిన ప్రతి పంటకూ క్రాప్ ఇన్సూరెన్స్ ఉందని, ఉప్పుకి మాత్రం ఇన్సూరెన్స్ లేదన్నారు. వర్షాలు, వరదలు వచ్చి ఉప్పు రైతులు నష్టపోయినప్పుడు ఇన్సురెన్స్ కల్పించే అంశంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు వేయిస్తాం, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం, తక్కువ ధరకే విద్యుత్ అందిస్తాం, ఉప్పు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇస్తాం, సబ్సిడీతో ట్రాక్టర్లు, మనిముట్లు అందిస్తామని తెలిపారు. పాదయాత్రలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పాల్గొన్నారు.

ఎంటిఎస్ అమలు చేయండి

ఆప్కాస్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆప్కాస్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎంటిఎస్ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అందరినీ కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని ఆప్కాస్ అఅవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విస్తృతస్థాయి సమావేశం తీర్మానించింది. మూడేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వెంటనే రెగ్యులర్ చేసేలా ఉత్తర్వులివ్వాలని, ఈలోగా సమాన పనికి సమాన వేతనం, సమాన సౌకర్యాలు, సెలవులు అమలు చేయాలని కూడా సమావేశం తీర్మానించింది. గన్నవరంలోని వెంకటేశ్వర యూనివర్సిటీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో శనివారం జరిగిన సమావేశానికి ఎం శేషుబాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఇ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

నూతన కమిటీ

అధ్యక్షులుగా జి చిన్నబాబు (తిరుపతి), ప్రధాన కార్యదర్శిగా ఎస్ నూర్ మహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంటుగా జి పవన్‌కుమార్ (ఎన్‌టిఆర్ జిల్లా), కోశాధికారిగా ఆర్ రజిని (హెచ్‌ఒడి), ఉపాధ్యక్షులుగా పి వెంకటసుబ్బయ్య (కడప), వి సంజీవ్ (గుంటూరు), ఎన్ ఆదినారాయణ (ప్రకాశం), రవి (కర్నూలు), లక్ష్మణరావు (బాపట్ల), కుమార్ (తిరుపతి), శ్రీనివాసరావు (ఎన్‌టిఆర్) సత్యనారాయణ (ఎపి సచివాలయం), శ్రీధర్ (తూర్పుగోదావరి), కార్యదర్శులుగా ఎన్ భాగ్యలక్ష్మి (గుంటూరు హెచ్‌ఒడి), బిహెచ్‌విఎస్ఎన్ రాజు (హెచ్‌ఒడి), ఎం శేషుబాబు (కృష్ణా), టి రామకృష్ణ (అనకాపల్లి), ఎం రవిప్రకాష్ (కడప), రమేష్‌బాబు (గుంటూరు), బి మునిరాజా (తిరుపతి)తోపాటు కమిటీ సభ్యులుగా మరో 35 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్రంలో దిగుబడి ఆధారిత పంటల బీమాలో

పబ్లిక్ సెక్టార్ బీమా కంపెనీలను నియమించాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దిగుబడి ఆధారిత పంటల బీమాలో ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలను తొలగించి, పబ్లిక్ సెక్టార్ బీమా కంపెనీలను నియమించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర పంటల బీమా పరిహారం చెల్లింపులు పరిశీలిస్తే అన్నమయ్య, గుంటూరు, విశాఖపట్నం జిల్లాలకు దిగుబడి ఆధారంతో క్లెయిములు లేవని జిల్లాలకు కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు ఇంప్లిమెంట్ ఏజెన్సీలుగా వ్యవహరించాయని తెలిపారు. అన్నమయ్య జిల్లాకు హెచ్‌డిఎఫ్‌సి, గుంటూరులో రిలయన్స్, విశాఖపట్నానికి ఇఫ్‌కో టోకియా ఏజెన్సీలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో మాదిరే ఈ మూడు జిల్లాల్లోనూ అధిక వర్షాలతో చీడ, పీడలతో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గాయని తెలిపారు. రైతులకు ఖర్చులు పెరిగాయని, ఈ మూడు జిల్లాల్లో రైతాంగానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు. అనంతపురంలో రూ.269 కోట్ల ప్రీమియం వసూలు చేసిన రిలయన్స్ సంస్థ రైతులకు కేవలం రూ.43 కోట్లిస్తోందని, కృష్ణా జిల్లాలో వంద కోట్లకు పైన ప్రీమియం వసూలు చేసిన ఇఫ్‌కో టోకియా కంపెనీ రూ.57 లక్షల పరిహారం నిర్ధారించిందని వివరించారు. ఎన్‌టిఆర్ జిల్లాలో వంద కోట్ల ప్రీమియం తీసుకుని రూ.32 లక్షల క్లెయిములు ఇస్తోందని, ప్రకాశం జిల్లాలో అత్యధికంగా ఎఐసి పరిహారం ఇస్తోందని ఆ జిల్లా రైతుల తరుపున రూ.191 కోట్ల ప్రీమియం తీసుకున్న ఎఐసి రూ.172 కోట్ల పరిహారం ఇస్తోందన్నారు. కడపలో రూ.245 కోట్ల ప్రీమియం తీసుకొని రూ.139 కోట్లు రైతులకు పరిహారం చెల్లిస్తోందన్నారు. పబ్లిక్ సెక్టార్ బీమా కంపెనీలు ఎలా రైతాంగానికి చెల్లిస్తున్నాయో, ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలు ఏలా చెల్లిస్తున్నాయో దీన్ని బట్టి అర్థమవుతోందని పేర్కొన్నారు. ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు లాభాలు మూటకట్టుకోవడమే గానీ రైతుల బాధలు పట్టడం లేదని, కనుక రాష్ట్ర పంటల దిగుబడి ఆధారిత బీమా పథకం నుంచి ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలను తొలగించి, పబ్లిక్ సెక్టార్ కంపెనీలను నియమించేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని వారు కోరారు.

రాజేష్ భౌతికకాయం వద్ద నివాళులర్పించిన వి శ్రీనివాసరావు, సిపిఎం నేతలు

పేదల పక్షపాతి రాజేష్

- భౌతికకాయం వద్ద నివాళులర్పించి పాడె మోసిన వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- మండవల్లి (ఏలూరు జిల్లా)

మురాల రాజేష్ పేదల పక్షపాతి అని, నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాజేష్ భౌతికకాయాన్ని శనివారం ఆయన సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2012లో ఆక్వా చెరువు తవ్వకానికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంతో సిపిఎంలో రాజేష్ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. కృష్ణా జిల్లాలో 40 కేంద్రాల్లో 50 వేల ఎకరాల్లో భూ పోరాటం సాగించిన పోరాట యోధుడన్నారు. ఒకపక్క ఆరోగ్యం బాగోలేకపోయినా ప్రజా పోరాటాల్లో పాల్గొన్న రాజేష్ ఇకలేరనేది జీర్ణించుకోలేకపోతున్నామని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వి.శ్రీనివాసరావు తెలిపారు. అంతిమయాత్రలో ఆయనతోపాటు పలువురు సిపిఎం నేతలు పాడె మోశారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తీరని లోటు

రాజేష్ మృతికి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, మాజీ ఎంపి పి.మధు, మాజీ ఎంఎల్ఎ పాటూరు రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిపిఎం ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ కార్యదర్శి బి.ఆర్.తులసీరావు తదితరులు సంతాపం తెలిపారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. పేదల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండాయే మార్గమని నమ్మిన ఆయన మృతి బాధాకరమని పేర్కొన్నారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్ప, ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు శనివారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గంగవరం పోర్టు నిర్వాసిత ఉద్యోగుల పట్ల పోర్టు యాజమాన్యం తీవ్ర వివక్ష చూపడమేగాక కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం ఆయన ఒక లేఖ రాశారు. జులై 7న కార్మికులను కలిసి సమస్యలు స్వయంగా తెలుసుకున్న తరువాతే లేఖ రాస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, షాప్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జిపిఎస్) కింద కార్మికులను చేర్చుకుని వారికి వేతనాల్లోనూ, బెనిఫిట్స్‌లోనూ అన్యాయం చేస్తున్నారని తెలిపారు. 14 ఏళ్లకు పైబడి పనిచేస్తున్న కార్మికులకు బేసిక్ ఇప్పటికీ రూ.3,700 మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. యూనియన్ పెట్టుకున్నారన్న కారణంతో పోర్టు మేనేజ్‌మెంట్ కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, నిర్వాసిత కార్మికులను విధులకు రాకుండా అడ్డుకోవడం, వారిలో కొంతమందిని సస్పెండ్ చేసి విధులకు హాజరుకావాలంటే ఆంక్షలకు ఒప్పుకోవాలని షరతులు పెట్టి బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు. పోర్టు లాభాల్లో నడుస్తున్నా.. కార్మికులకు చాలీచాలని జీతాలతో సరిపెడుతున్నారని, ఐదేళ్లకు రూ.800 వేతన పెంపుదల జరిగిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలని కోరారు. జరుగుతున్న అన్యాయంపై కార్మికులు నిరసన చేపడితే జిల్లా కలెక్టరు సమక్షంలో మేనేజ్‌మెంట్ కొన్ని షరతులకు అంగీకరించిందని, వాటినీ అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని వివరించారు. మేనేజ్‌మెంట్ వైఖరిని భరించలేక న్యాయమైన కోర్కెల కోసం పోర్టు కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్నారని, వైసిపి ఎమ్మెల్యేతో సహా అన్ని పార్టీలూ, సంఘాలూ వీరికి మద్దతునిస్తున్నాయని తెలిపారు. దీనిపై జోక్యం చేసుకుని పోర్టుకోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికులను జిపిఎల్ (గంగవరం పోర్టు లిమిటెడ్), జిపిఎస్ కేటగిరీలుగా కాకుండా మొత్తాన్ని ఐడి యాక్టు కిందకు తీసుకురావాలని లేఖలో కోరారు. కనీస వేతన చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, అక్రమంగా సస్పెండైన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడకుండా వారికి కార్మిక చట్టాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, యూనియన్‌ను కొనసాగించేందుకు తగిన పరిస్థితులు కల్పించాలని సిఎంను కోరారు.

గోదావరి జిల్లాల నుంచే వైసిపి పతనం

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్‌ని చూడాలంటే ఉభయ గోదావరి జిల్లాల నుంచే వైసిపి పతనం ప్రారంభం కావాలని, ఇక్కడ ప్రారంభమైతే అది రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తుందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం వారాహి విజయ యాత్ర కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాత్ర తొలి విడతను విజయవంతం చేయడంలో భాగమైన కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. క్యాటరింగ్, వలంటీర్, అకామిడేషన్, మెడికల్, మీడియా కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న మలి విడత వారాహి యాత్రను ఇదే పట్టుదలతో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను పవన్‌కల్యాణ్ కోరారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. వారాహి యాత్ర ఒక స్ఫూర్తిదాయక ప్రస్తానమన్నారు.

రజకులకు రక్షణ కల్పించాలి

ఎం భాస్కరయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రజకులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరయ్య కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకాశం జిల్లా నూతలపాడు మండలం గురవారెడ్డిపాలెంలో రజకులైన వెంకట నారాయణపై కోటిరెడ్డి రామలింగారెడ్డి దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఎస్‌పి తక్షణమే రామలింగారెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బడికి పంపకపోతే పథకాలు కట్

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ.. వలంటీర్ల ద్వారా చేపట్టిన ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేస్తామని చెప్పారు. ఉపాధ్యాయులకు సంబంధించిన విధానపరమైన అంశాలను రాష్ట్రస్థాయిలో చర్చించి పరిష్కరించాల్సి ఉందన్నారు. నాడు-నేడు పనులను డిసెంబరు నాటికి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మౌలిక సదుపాయాల కమిషనరు కె భాస్కర్ వివరించారు. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ పూర్తయిందని సమగ్ర శిక్షా అభియాన్ డైరెక్టరు శ్రీనివాస్ వివరించారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం డైరెక్టరు నిధి మీనాన్, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టరు మువ్వా రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

- ద్రవిడ యూనివర్సిటీ మాజీ విసి కెఎస్.చలం
- ముగిసిన సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల 'స్టీల్ ప్లాంట్ రక్షణ దీక్ష'

నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న ప్రొఫెసర్ కెఎస్.చలం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపదని, ఈ కర్మాగారాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ కెఎస్.చలం అన్నారు. ప్రజా పోరాటాలను ఉధృతం చేయడం ద్వారానే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలమని, అందుకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు రక్షణ కోసం సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు శుక్రవారం తలపెట్టిన 24 గంటల దీక్ష శనివారం ఉదయం 10 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గల దీక్షా స్థలి వద్ద ముగింపు సభ ఏర్పాటు చేశారు. తొలుత దీక్ష చేపట్టిన కె.లోకనాథం (అనకాపల్లి), ఎం.జగ్గునాయుడు (విశాఖ), పి.అప్పలనర్స (అల్లూరి సీతారామరాజు), టి.సూర్యనారాయణ (విజయనగరం), డి.గోవిందరావు (శ్రీకాకుళం), జి.వెంకటరమణ (పార్వతీపురం మన్యం)కు కెఎస్.చలం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను, ప్రభుత్వ రంగ సంస్థల భూములను, విశాఖ తీరాన్ని స్వాహా చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న ప్రాంతాన్ని అదానీ కోస్ట్‌గా మారుస్తున్నారని, వ్యాపారులే ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగి కోట్ల రూపాయలు సంపాదించుకుంటున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 38 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు ఆయా ప్రభుత్వాల చేతుల్లోనే ఉండాలన్నారు. దానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టడం ప్రజల సంపదను వ్యక్తులకు దోచిపెట్టడమేనని తెలిపారు.

ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు దీక్ష చేయడం అభినందనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేసే వారికే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. దీక్ష చేపట్టిన సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు సమావేశాల్లో మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మకాన్ని నిలిపివేస్తూ ప్రకటన చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత వహించి దేశంలోని బిజెపియేతర పార్టీల ఎంపిల మద్దతును కూడగట్టి పార్లమెంటును స్తంభింపచేయాలని డిమాండ్ చేశారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలను పక్కనబెట్టి రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలని, స్టీల్ ప్లాంట్ రక్షణకు కేంద్రంతో చిత్త శుద్ధితో పోరాడాలని కోరారు.

పలువురు మద్దతు

సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల ఉక్కు దీక్షకు ఎఐటియుసి, టిఎన్‌టియుసి, సిఎఫ్‌టియుఐ, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, ఎంసిపిఐ నాయకులు గోవింద్, కృష్ణ, శ్రీనివాసరావు, డి.అప్పారావు, పట్నాయక్, ప్రజా సంఘాల నాయకులు పి.మణి, ఎం.సుబ్బారావు, పి.రాజ్‌కుమార్, జి.అప్పలరాజు, ఎ.సింహాచలం, క్రాంతినగర్ గ్రామ అధ్యక్షులు కె.పరదేశి నాయుడు, పీపుల్‌ఫర్ ఇండియా నాయకులు బిఎల్.నారాయణ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, షీలానగర్ గ్రామ సంఘం నాయకులు, పలు ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు మద్దతు తెలిపారు.


ఇడుపులపాయలోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిఎం జగన్

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

- కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించిన జగన్

ప్రజాశక్తి - వేంపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతి వేడుకలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ అభిమానులు, వైసిపి కార్యకర్తలు పలుచోట్ల ప్రత్యేక కార్యాక్రమాలు నిర్వహించారు. కడప జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. తల్లి విజయమ్మ, భార్య వైఎస్ భారతితో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా తొలిరోజు సింహాద్రిపురం ప్రజాప్రతినిధులతో సిఎం సమావేశమయ్యారు. శనివారం రాత్రి ఇడుపులపాయలోనే సిఎం బస చేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాషా, మంత్రులు ఆదిమూలపు సురేష్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

పేదల సిఎం రాజశేఖరరెడ్డి : షర్మిల

పేద ప్రజల కోసం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే నేరవేర్చిన ఘనత వైఎస్ఆర్‌కు దక్కుతుందని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు షర్మిల అన్నారు. వైఎస్ఆర్ సమాధి వద్ద తల్లి విజయమ్మతో కలిసి కుటుంబ సమేతంగా షర్మిల నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...అనేక సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన నాయకుడు వైఎస్ఆర్ అని కొనియాడారు. అనంతరం కడప ఎయిర్ పోర్టుకు వెళ్లి అక్కడి నుంచి తెలంగాణలోని పాలేరుకు చేరుకున్నారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
PUB/0739
ఇ-టెండరు నోటీసు

దిగువ తెలిపిన పనుల కోసం దిగువ సంతకందారుచే IREPS లో టెండర్లు కోరబడుచున్నవి.

క్ర.సం.1. టెండరు నోటీసు నం.: B/E.29-TRD-TNDR-08-23-24 తేది: 3-7-2023. టెండరు నం. B/E.29-TRD-TNDR-08-23-24, **పని పేరు:** 1) విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద విజయవాడ డివిజన్‌లోని నార్త్ సెక్షన్‌లో AKP, YLM, TUNI, CCT, SLO, APT & NDD (7 స్టేషన్లు) వద్ద COP షెల్టర్ల ఏర్పాటుకు సంబంధించి OHE కి మార్పులు చేర్పులు. 2) విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ABSS) క్రింద విజయవాడ డివిజన్-DEN/నార్త్/BZA అధికార పరిధిలోని CCT, SLO APT, AKP, YLM, TUNI మరియు NDD (7 స్టేషన్స్) వద్ద ప్లాట్‌ఫారం సర్ఫేస్‌లకు అభివృద్ధి పనులు మరియు YLM (PF-I) వద్ద ప్లాట్‌ఫారం విస్తరణ ఏర్పాటు చేయుట. 3) విజయవాడ డివిజన్ - SW-I: ABS స్కీమ్ క్రింద తుని, యలమంచిలి & అనపర్తి రైల్వే స్టేషన్లలో పురుషులు, మహిళలు, దివ్యాంగ్‌జన్ కొరకు విడివిడిగా ప్రీమియం మాడ్యులర్ టాయిలెట్స్ ఏర్పాటు చేయుట (13.0x15.5 = 188.50 Sq.m) మరియు వెయిటింగ్ హాల్ (10x10 = 100 Sq.m) ఏర్పాటు చేయుట SW-II: ABS స్కీమ్ క్రింద నిడదవోలు, సామర్లకోట, కాకినాడటౌన్ మరియు అనకాపల్లి రైల్వే స్టేషన్ల వద్ద పురుషులు, మహిళలు, దివ్యాంగ్‌జన్ కోసం విడివిడిగా ప్రీమియం మాడ్యులర్ టాయిలెట్స్ ఏర్పాటు చేయుట (13.0x15.5 = 188.50 Sq.m) మరియు వెయిటింగ్ హాల్ (20x10 = 200 Sq.m) ఏర్పాటు చేయుట. **సుమారు విలువ:** (రూ.) 2,25,47,276/-, **బిడ్ సెక్యూరిటీ (బయానా):** (రూ.) 2,62,700/-, **పూర్తిచేయవలసిన కాలం:** 12 నెలలు, **ముగింపు తేది & సమయం:** 27-07-2023న 15. 00 గంటలు.

క్ర.సం.2. టెండరు నోటీసు నం.: B/E.29-TRD-TNDR-09-23-24 తేది: 3-7-2023. టెండరు నం. B/E.29-TRD-TNDR-09-23-24, **పని పేరు:** 1) విజయవాడ డివిజన్: విజయవాడ డివిజన్‌లో ABSS క్రింద అభివృద్ధి చేయబడే 9 స్టేషన్లలోని రైల్వే ప్లాట్‌ఫారంలపైన 23 ఎస్కలేటర్స్ ఏర్పాటు చేయుటకు సంబంధించి OHE కి మార్పులు చేర్పులు. 2) విజయవాడ డివిజన్: విజయవాడ డివిజన్‌లో ABSS క్రింద 14 స్టేషన్ల వద్ద 28 లిఫ్ట్‌లు ఏర్పాటు చేయుటకు సంబంధించి OHE కి మార్పులు చేర్పులు (సుగమ్య అభియాన్) (ఫేజ్-II). **సుమారు విలువ:** (రూ.) 84,65,590/-, **బిడ్ సెక్యూరిటీ (బయానా):** (రూ.) 1,69,300/-, **పూర్తిచేయవలసిన కాలం:** 12 నెలలు, **ముగింపు తేది & సమయం:** 27-07- 2023న 15. 00 గంటలు.

క్ర.సం.3. టెండరు నోటీసు నం.: B/E.29-TRD-TNDR-11-23-24 తేది: 3-7-2023. టెండరు నం. B/E.29-TRD-TNDR-11-23-24, **పని పేరు:** 1) విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద విజయవాడ డివిజన్‌లోని సౌత్ సెక్షన్‌లో SKM మరియు OGL (2 స్టేషన్లు) వద్ద COP షెల్టర్స్ ఏర్పాటుకు సంబంధించి OHE కి మార్పులు చేర్పులు. 2) విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ABSS) క్రింద విజయవాడ డివిజన్‌లోని సౌత్ సెక్షన్‌లోని SKM మరియు OGL (2 స్టేషన్లు) వద్ద ప్లాట్‌ఫారం సర్ఫేస్‌లకు అభివృద్ధి పనులు ఏర్పాటు చేయుట 3) విజయవాడ డివిజన్- SW-I: ABS స్కీమ్ క్రింద SKM రైల్వే స్టేషన్లలో పురుషులు, మహిళలు, దివ్యాంగ్‌జన్ కొరకు విడివిడిగా ప్రీమియం మాడ్యులర్ టాయిలెట్స్ ఏర్పాటు చేయుట (13.0x15.5 = 188.50 Sq.m) మరియు వెయిటింగ్ హాల్ (10x10 = 100 Sq.m) ఏర్పాటు చేయుట SW-II: ABS స్కీమ్ క్రింద OGL రైల్వే స్టేషన్ వద్ద పురుషులు, మహిళలు, దివ్యాంగ్‌జన్ కోసం విడివిడిగా ప్రీమియం మాడ్యులర్ టాయిలెట్స్ ఏర్పాటు చేయుట (13.0x15.5 = 188.50 Sq.m) మరియు వెయిటింగ్ హాల్ (20x10 = 200 Sq.m) ఏర్పాటు చేయుట. **సుమారు విలువ:** (రూ.) 63,95,163/-, **బిడ్ సెక్యూరిటీ (బయానా):** (రూ.) 1,27,900/-, **పూర్తిచేయవలసిన కాలం:** 12 నెలలు, **ముగింపు తేది & సమయం:** 28-07- 2023న 15. 00 గంటలు.

క్ర.సం.4. టెండరు నోటీసు నం.: B/E.29-TRD-TNDR-12-23-24 తేది: 3-7-2023. టెండరు నం. B/E.29-TRD-TNDR-12-23-24, **పని పేరు:** 1) విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద BZA-VSKP సెక్షన్‌లోని అనకాపల్లి, నిడదవోలు మరియు తడేపల్లిగూడెం స్టేషన్ల వద్ద 12 అడుగులు వెడల్పుగల FOBs, 3 నం.లు ఏర్పాటు చేయుట 2) విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద BZA-VSKP సెక్షన్‌లోని సింగరాయకొండ మరియు తెనాలి స్టేషన్ల వద్ద 12 అడుగులు వెడల్పుగల FOBs, 2 నం.లు ఏర్పాటు చేయుట 3) విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద తాడేపల్లిగూడెం, గుణదల, మచిలీపట్నం, గుడివాడ మరియు నర్సాపూర్ స్టేషన్ల వద్ద COP షెల్టర్స్ ఏర్పాటు చేయుట. **సుమారు విలువ:** (రూ.) 48,06,560/-, **బిడ్ సెక్యూరిటీ (బయానా):** (రూ.) 96,100/-, **పూర్తిచేయవలసిన కాలం:** 12 నెలలు, **ముగింపు తేది & సమయం:** 31-07- 2023న 15. 00 గంటలు.

క్ర.సం. 1,2,3 & 4: **టెండరు ఫారం ధర:** (రూ.) లేదు

ముగింపు తేది: క్ర.సం.: 1 & 2: 27-07-2023న 15.00 గంటలు, క్ర.సం. 3: 28-07-2023న 15.00 గంటలు, క్ర.సం.4: 31-07-2023న 15.00 గంటలు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ TrD / విజయవాడ

ఆర్‌టిఎ చెక్‌పోస్టులపై ఎసిబి దాడులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని శ్రీకాకుళం, ఏలూరు, కృష్ణా జిల్లాల సరిహద్దుల్లోని ఆర్‌టిఎ చెక్‌పోస్టులపై ఎసిబి అధికారులు శనివారం తెల్లవారు జామున ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో లారీ డ్రైవర్ల నుంచి పెద్దమొత్తంలో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న ఒక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టరు, నలుగురు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో కలిపి ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎసిబి 14400 కాల్ సెంటర్, ఎసిబి యాప్‌కు వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించారు. ఒడిశా సరిహద్దులోని శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, తెలంగాణ సరిహద్దులోని ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి, గన్నవరం వద్ద వున్న తాత్కాలిక ఆర్‌టిఎ చెక్‌పోస్టులపై ఈ దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇచ్ఛాపురం వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టరుతోపాటు ఇద్దరు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు నుండి అధికారింగా ప్రభుత్వానికి చెందిన రూ.5లక్షలతోపాటు అక్రమంగా వసూలు చేసిన రూ.2.21 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. జీలుగుమిల్లి వద్ద అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టరు, ఇద్దరు హోమ్ గార్డుల నుంచి అధికారికంగా వున్న రూ.1.05 లక్షలతోపాటు అక్కడే వున్న ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల నుండి రూ.1.23 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. గన్నవరం వద్ద అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టరు, ఇద్దరు హోమ్‌గార్డులు, ఇద్దరు ప్రైవేట్ వ్యక్తుల నుండి రూ.19,000లను స్వాధీనం చేసుకున్నారు.

మున్సిపల్ మహిళా కార్మికుల భద్రత గాలికి

- శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనరు కె ధనలక్ష్మి విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు లైంగిక వేధింపుల నుంచి భద్రత కల్పించాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనరు కె ధనలక్ష్మి డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో మున్సిపల్ రంగ మహిళా కార్మికుల రాష్ట్ర సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలపై దాడులు గణనీయంగా పెరిగిపోయాయని అన్నారు. అధికారంలోకి వచ్చాక మున్సిపల్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి గాలికొదిలేశారని విమర్శించారు. కనీసవేతనాలు లేక బానిసల తరహాలో పనిచేయించుకుంటున్నారని అన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ ఇందీవర మాట్లాడుతూ.. మున్సిపల్ మహిళా కార్మికులు పనిప్రదేశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. పని ప్రదేశాల్లో ప్రత్యేకంగా టాయ్‌లెట్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. నెలకు మూడు రోజులు సెలవులు ఇవ్వాలని, పనిచేసేందుకు అవసరమైన రక్షణ పనిముట్లను సమకూర్చాలని అన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ రంగంలో పనిచేసే మహిళా కార్మికులకు సంబంధించి లైంగిక నిరోధక కమిటీల్లో మహిళా కార్మికులు లేకుండా ఏర్పాటు చేయడం తగదని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేయించుకుంటున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అధికార పార్టీ కార్పొరేటర్లు, నాయకుల రాజకీయ వేధింపులు తాళలేక మహిళా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత గురించి నిరంతరం మాట్లాడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళితులు, గిరిజన మహిళలు పెద్దసంఖ్యలో పనిచేసే మున్సిపల్ రంగ కార్మికులు కనిపించక పోవడం ఆందోళనకరమని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్‌లను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతమ్మ, సుజాత, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై బిజెపి నేత దుశ్చర్య

- 'స్మార్ట్ విలేజ్' మోసంపై ప్రశ్నించినందుకు దాడి

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ (అనకాపల్లి జిల్లా)

తనపై జరిగిన దాడిని మీడియాకు వివరిస్తున్న బాధితురాలు

స్మార్ట్ విలేజ్ మోసం గురించి ప్రశ్నించిన ఓ మహిళపై బిజెపి నాయకుడు దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన బిజెపి నాయకుడు లాలం వెంకటరమణ నర్సీపట్నం కేంద్రంగా స్మార్ట్ విలేజ్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికాడు. దీంతో నాతవరం మండలం డి.యర్రవరం గ్రామానికి చెందిన లోకవరపు జగదీశ్వరి తన కుమారుడి ఉద్యోగం కోసం రూ. రెండు లక్షలు కట్టారు. నేటికీ ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో తన డబ్బులు వెనక్కి ఇవ్వాలని అడిగేందుకు వెంకటరమణ ఇంటికి జగదీశ్వరి వెళ్లారు. జరిగిన మోసంపై ప్రశ్నిస్తుండగా..బిజెపి నాయకుడు దాడికి పాల్పడ్డాడు. కుమారుడి ఉద్యోగం కోసం కూలి డబ్బులు వెంకటరమణకు ఇచ్చానని, ఉద్యోగం రాకపోవడంతో తిరిగి డబ్బులు ఇచ్చేయాలని కోరేందుకు వెళ్లగా ఇలా దాడి చేయడం దారుణమని ఆమె వాపోయారు. ఈ విషయమై ఫిర్యాదు చేయడానికి నర్సీపట్నం రాగా నాతవరం పోలీసు స్టేషన్‌కు వెళ్లాలని పోలీసులు సూచించినట్టు బాధితురాలు తెలిపారు. మహిళపై దాడి చేసిన బిజెపి నేత వెంకటరమణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, నర్సీపట్నం డివిజన్ నాయకులు ప్రసన్న డిమాండ్ చేశారు.

ఇ-టెండరు ప్రకటన నం.15-2023
తేది: 05-07-2023
PUB/0737

దిగువ తెలిపిన పనుల కోసం భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న **సీనియర్ డివిజనల్ ఇంజినీర్/ కో-ఆర్డినేషన్/ గుంతకల్** వారు ఇ-టెండర్లు కోరుతున్నారు.

ముగింపు తేది మరియు సమయం: 31-07-2023, 15:00 గం.

క్ర.సం: 1. టెండరు నం.: Engg-GTL-West-1421. **పని వివరణ: SW-I: ధర్మవరం జంక్షన్ - పాకాల జంక్షన్ సెక్షన్:** DEN/ West అధికార పరిధిలోని ADEN/MPL సెక్షన్‌లో సెన్ తయారు చేయడానికి ఎంబ్యాంక్ మెంట్‌లో మట్టిపని. **SW-II: ధర్మవరం జంక్షన్ - గుత్తి జంక్షన్ (DN/SL) సెక్షన్:** ADEN/ ATP సబ్ డివిజన్ SSE/P.Way/ATP మరియు SSE/P.Way/KLU అధికార పరిధిలోని సెన్‌కు ప్రతిపాదిత మరమ్మతులు. **ప్రకటిత విలువ (రూ.):** 1,45,83,888.00 పైసలు, **బయానా (రూ.):** 2,22,900.00 పైసలు.

క్ర.సం: 2. టెండరు నం.: Engg-GTL-Central-1422. **పని వివరణ: రేణిగుంట జంక్షన్ - గుంతకల్ జంక్షన్ (DN/SL) సెక్షన్:** ADEN/GY సబ్ డివిజన్ SSE/P.Way/KDP అధికార పరిధిలోని సెన్‌కు ప్రతిపాదిత మరమ్మతులు. **ప్రకటిత విలువ (రూ.):** 1,49,45,472.00 పైసలు, **బయానా (రూ.):** 2,24,700.00 పైసలు.

క్ర.సం: 3. టెండరు నం.: Engg-GTL-Central-1423. **పని వివరణ: డోన్ జంక్షన్ - గుంతకల్ జంక్షన్ సెక్షన్:** ADEN/DHNE సబ్ డివిజన్ క్రింద SSE/P.Way/DHNE అధికార పరిధిలోని సెన్‌కు ప్రతిపాదిత మరమ్మతులు. **ప్రకటిత విలువ (రూ.):** 72,83,657.70 పైసలు, **బయానా (రూ.):** 1,45,700.00 పైసలు.

క్ర.సం: 4. టెండరు నం.: Engg-GTL-Bridges-1424. **పని వివరణ:** 01-09-2023 నుండి 30-06-2024 వరకు కాలవ్యవధి కోసం DEN/బ్రిడ్జెస్/GTL క్రింద ADEN/బ్రిడ్జెస్/GTL అధికార పరిధిలో వార్షిక జోనల్ కాంట్రాక్టు (బ్రిడ్జీ పనులు). **ప్రకటిత విలువ (రూ.):** 35,00,000.00 పైసలు, **బయానా (రూ.):** 70,000.00 పైసలు.

క్ర.సం: 5. టెండరు నం.: Engg-GTL-Bridges-1425. **పని వివరణ:** TBTR: గుంతకల్ డివిజన్‌లో 5 బ్రిడ్జీల కోసం H-బీమ్ స్లీపర్స్‌తో స్టీల్ చానెల్ పునరుద్ధరణ (గుత్తి జంక్షన్ - ధర్మవరం జంక్షన్ సెక్షన్ యొక్క Br. No.45 DN, రేణిగుంట జంక్షన్ - గుంతకల్ జంక్షన్ సెక్షన్ యొక్క Br. Nos.825 DN, 232 DN మరియు గుంతకల్ జంక్షన్ - బళ్లారి జంక్షన్ సెక్షన్‌లో Br. Nos.326C DN, 326E DN). **ప్రకటిత విలువ (రూ.):** 4,72,32,558.27 పైసలు, **బయానా (రూ.):** 3,86,200.00 పైసలు.

బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు **http://ireps.gov.in** కు లాగిన్ కావలెను. ఏవేని సవరణలు ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

డివిజినల్ రైల్వే మేనేజర్ / వర్క్స్/ గుంతకల్
A1034

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

దినసరి కనీస వేతనం రూ.600 ఇవ్వాలి

- ఎపి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో పని చేస్తున్న రోజువారీ కార్మికులకు కనీస వేతనంగా రోజుకు రూ.600 చొప్పున ఇవ్వాలని ఎపి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎవి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా గన్నవరంలోని ఎన్‌టిఆర్ వెటర్నరీ కళాశాలలో ఎపి పొరుగు సేవ (అవుట్ సోర్సింగ్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం ఎస్‌వియు సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు చినబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, రెగ్యులర్ చేయాలని కోరుతూ కొన్నేళ్లుగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పోరాడుతున్నారన్నారు. కనీస వేతనాలు ఇస్తామని, ఖాళీల భర్తీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రాధాన్యత ఇస్తామని గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించడం సరికాదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను బానిసలుగా చూస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. అర్హత ఉన్న వారందరినీ రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో మరోసారి పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ఇప్పటికే సంఘం చేసిన పోరాటాలతో మెటర్నటీ లీవ్, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు సాధించుకున్నామని గుర్తు చేశారు. ఎపి అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ శేషుబాబు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించినా పాలకులు పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. అందరం సంఘటితం కావాలని, రానున్న రోజుల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తేనే న్యాయం జరుగుతుందన్నారు.

ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ టూర్‌కు ఎపి విద్యార్థులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బెంగళూరులో జరిగిన సిటీ ఆఫ్ స్టార్టప్, ఇన్నోవేషన్ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి మూడు విద్యార్థి బృందాలు పాల్గొన్నాయని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఇఆర్‌టి) డైరెక్టరు బి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఇఎండిపి) ఎక్స్‌పో-2023లో భాగంగా ఈ కార్యక్రమం జరిగిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ టూర్ కింద ఉద్యం లెర్నింగ్ ఫౌండేషన్ సహాయం అందించిందని తెలిపారు. ఈ యాత్రలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, ప్రోగ్రాం డైరెక్టరు టి పద్మావతి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్ కుమార్, సమగ్ర శిక్షా అభియాన్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు అభినందించారని పేర్కొన్నారు.

దళిత, గిరిజన ఉద్యోగుల ఆందోళనకు కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 10న చలో విజయవాడ చేపడుతున్న దళిత, గిరిజన ఉద్యోగుల ఆందోళనకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగ బద్ధంగా ఇచ్చిన ప్రమోషన్స్‌లో రిజర్వేషన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 33కు పైగా ప్రభుత్వ శాఖలుండగా అందులో ఏ ఒక్క డిపార్టుమెంట్‌లోనూ ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగ బద్ధమైన ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడం లేదని, అత్యున్నత న్యాయస్థానాల ఆదేశాలను ప్రభుత్వం గౌరవించడం లేదని తెలిపారు. ఈ నెల 10న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉద్యోగ సంఘాలు హాజరు కావాలని కెవిపిఎస్ పిలుపునిస్తుందన్నారు.

మరో ఉద్యమానికి సిద్ధం : ఫ్యాప్టో

ప్రజాశక్తి-గుంటూరు

సదస్సులో అభివాదం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే మరో బిఆర్‌టిఎస్ ఉద్యమం తప్పదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో దశల వారీ పోరాటంలో భాగంగా గుంటూరులో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం.కళాధర్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని, మెరుగైన పిఆర్‌సి ఇస్తామని, సకాలంలో డిఎలు, బకాయిల చెల్లిస్తామని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరిస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని అనేక హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. నాలుగేళ్లలో ఒక్కరోజు కూడా ఉద్యోగ సంఘాల నేతలను చర్చలకు పిల్లవలేదని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చర్చలకు పిలిచి అన్నీ పరిష్కరిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యా రంగంలో 117 జిఒ పేరుతో పాఠశాలలను, ఉపాధ్యాయుల సంఖ్యను కుదింపు చర్యలు చేపట్టారని తెలిపారు. సిపిఎస్ అయినా, జిపిఎస్ అయినా రెండూ కార్పొరేట్ల లాభాల కోసమేనని, వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలలను సందర్శిస్తూ ప్రభుత్వ విద్యను, ఉపాధ్యాయులను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలను అపహస్యం చేసే విధంగా ప్రభుత్వం చేపట్టిన సిఫార్సు బదిలీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీలు, ఇతర ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేపడతామని హెచ్చరించారు.

దేశంలో తగ్గిన ఇళ్ల అమ్మకాలు

- ప్రథమార్థంలో 3% పెరిగిన వాణిజ్య లీజింగ్ స్థలాలు
- నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్

హైదరాబాద్ : దేశ వ్యాప్తంగా నివాస గృహాల అమ్మకాలు తగ్గాయి. ప్రస్తుత ఏడాది జనవరి నుంచి జూన్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1) కాలంలో 1 శాతం తగ్గి 1,56,640 యూనిట్లకు పరిమితమయ్యాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన రిపోర్ట్‌లో వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో 1,58,705 యూనిట్లు రిజిస్ట్రర్ అయ్యారు. ఇదే సమయంలో 25.3 మిలియన్ల చదరపు అడుగుల కార్యాలయాల స్థల లీజింగ్ రికార్డ్ కాగా.. గడిచిన హెచ్1లో 3 శాతం పెరిగి 26.1 మిలియన్ చదరపు అడుగులుగా నమోదయ్యింది. నివాస అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకున్నప్పటికీ.. గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో రెండో సారి గరిష్ట స్థాయి అమ్మకాలు జరిగాయి.

హైదరాబాద్‌లో తగ్గిన ఆఫీసు లీజింగ్

నైట్ ఫ్రాంక్ గణంకాల ప్రకారం.. గడిచిన హెచ్1లో హైదరాబాద్‌లో నివాస అమ్మకాలు 5 శాతం పెరిగి 15,355 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే హెచ్1లో 14,693 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఇదే సయమంలో ఆఫీసు లీజింగ్ 3.2 మిలియన్ చదరపు అడుగులుగా ఉండగా.. గడిచిన హెచ్1లో 8 శాతం తగ్గి 2.9 మిలియన్ చదరపు అడుగులుగా చోటు చేసుకుంది. 2023 జనవరి నుంచి జూన్ కాలంలో ఢిల్లీ - ఎన్‌సిఆర్ పరిధిలో నివాస అమ్మకాలు 3 శాతం పెరిగి 30,114 యూనిట్లుగా. ఆఫీసు లీజింగ్‌లో 24 శాతం పెరిగి 5.1 మిలియన్ చదరపు అడుగులుగా నమోదయ్యింది. బెంగళూరులో నివాస అమ్మకాలు 2 శాతం తగ్గి 26,247 యూనిట్లుగా, పూణెలో 1 శాతం తగ్గి 21,670 యూనిట్లుగా, చెన్నయ్‌లో 3 శాతం పెరిగి 7,150 యూనిట్లుగా, కోల్‌కత్తాలో 3 శాతం పెరిగి 7,324 యూనిట్ల చొప్పున చోటు చేసుకున్నాయి.

మళ్లీ పెరిగిన పసిడి ధర

న్యూఢిల్లీ : బంగారం ధరల్లో పెరుగుదల నమోదయ్యింది. గోల్డ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం.. శనివారం న్యూఢిల్లీ, హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లలో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.440 పెరిగి రూ.59,510గా నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ.400 పెరిగి రూ.54,550గా పలికింది. కిలో వెండిపై రూ.1,000 పెరిగి రూ.73,300గా ఉంది. ఇటీవల తగ్గుతూ వచ్చిన బంగారం ధర వారాంతంలో పెరగడం గమనార్హం. అంతర్జాతీయంగా అమెరికాలో ఒక్క ఔన్స్ పసిడిపై 0.71 శాతం పెరిగి 1,924 డాలర్లుగా నమోదయ్యింది.

వామ్మో ఓడీ !

- ఒకేరోజు రూ.3,273 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రెండో త్రైమాసికంలో ఓవర్‌డ్రాఫ్ట్ వేధిస్తోంది. వరుసగా నాలుగు రోజులు ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే రాష్ట్ర ఖజానా కొనసాగింది. రికార్డు స్థాయిలో ఒకేరోజు రూ.3,273 కోట్లు ఓడీగా నమోదు కావడం గమనార్హం. ఇది క్రమంగా తగ్గుతూ వస్తున్నప్పటికీ, రాష్ట్రానికి వస్తున్న ఆదాయాన్ని రిజర్వ్‌బ్యాంకు నేరుగా ఓవర్‌డ్రాఫ్ట్‌కు జమ చేస్తుండడమేనని అధికారులు చెబుతున్నారు. ఈ నెల మూడో తేదీన రూ.3,273 కోట్లు ఓవర్‌డ్రాఫ్ట్‌గా వాడుకున్నారు. ఆ తరువాత ఖజానాకు వచ్చిన రూ.581 కోట్లు ఆర్‌బిఐ తీసుకోవడంతో ఓడీ మొత్తం 2,692 కోట్లకు తగ్గింది. ఆ తరువాత మరో రూ.1,610 కోట్లు జమ కావడంతో ఓడీ రూ.1,082 కోట్లకు, ఆ తరువాత ఇంకో రూ.320 కోట్లు జమ కావడంతో రూ.762 కోట్లకు ఓవర్‌డ్రాఫ్ట్ చేరుకుంది. ఒకేసారి రూ.4,600 కోట్ల వరకు మాత్రమే ఓడీ తీసుకోవడానికి పరిమితి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఆ స్థాయిలో ఓడీకి వెళ్లకపోయినప్పటికీ, తొలిసారి రూ.3,273 కోట్లు తీసుకోవాల్సి రావడం ఆశ్చర్యకరమేనని ఆర్థికశాఖ అధికారులు కూడా అభిప్రాయపడుతున్నారు.

వాట్సాప్, ఫేస్‌బుక్‌లపై నియంత్రణ..!

ట్రాయ్ సంప్రదింపులు

న్యూఢిల్లీ : సోషల్ మీడియా యాప్స్‌ను కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకునే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, సిగ్నల్ తదితర సోషల్ మీడియా యాప్ ప్రొవైడర్లను నియంత్రించడంపై టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సంప్రదింపులు ప్రారంభించింది. ఆందోళనలు, ఉద్రిక్త పరిస్థితుల్లో ఆ యాప్స్‌పై కొంత సమయం లేదా తాత్కాలిక నిషేధం విధించాల్సిన అవసరం ఉందా.. లేదా అనే విషయం మీద చర్చ మొదలు పెట్టింది. కమ్యూనికేషన్ యాప్స్ నియంత్రణ, తాత్కాలిక నిషేదం వంటి 14 అంశాలపై ట్రాయ్ సంప్రదింపులను మొదలుపెట్టింది. ఇంటర్నెట్ కాలింగ్ విషయంలో టెలికాం ప్రొవైడర్లకు వర్తించే నియమాలే కమ్యూనికేషన్ యాప్స్‌నకూ వర్తింపజేయాలని టెల్కోలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. తమ లాగే లైసెన్స్ ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

సంపాదకీయం

మిద్దె తోట

ఇటాలో కాల్వినో అనే రచయిత 1957లో 'ద బారన్ ఇన్ ద ట్రీస్' అనే నవల రాశాడు. ఈ నవల లోని హీరో భూమిపై కాకుండా చెట్లపై నివాసం వుండాలనుకుంటాడు. ఈ నవల స్ఫూర్తితో స్టెఫానో బోరీ అనే ఆర్కిటెక్ట్ ఇటలీ లోని మిలాన్ నగరంలో 80,112 మీటర్ల ఎత్తులో...'బాస్కో వర్టికల్' పేరుతో రెండు టవర్లు నిర్మించాడు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఈ టవర్లలోని ప్రతి అంతస్తులో అడవిని తలపించేలా అనేక రకాల చెట్లు, మొక్కలు పెంచుతున్నారు. అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన ఈ కృత్రిమ అడవిలో దాదాపు 900 చెట్లు, 5 వేల మొక్కలు వున్నాయి. అంతేకాదు...దాదాపు 1600 రకాల పక్షులు, రకరకాల సీతాకోక చిలుకలకు నివాసంగా మారింది. వేసవిలోనూ ఈ టవర్స్ లోని గదులు చల్లగా వుంటాయి. ఎటుచూసినా పచ్చదనంతో ఆహ్లాదకరంగా, పక్షుల కిలకిలారావాలతో ఉల్లాసంగా వుంటుంది. పర్యావరణ కాలుష్యానికి దూరంగా, స్వచ్ఛమైన గాలికి దగ్గరగా జీవిస్తున్నారు. ఈ టవర్స్‌లో నివసించేవారికి ఏసీ వాడకం కూడా తగ్గిపోయిందట. కొలంబియాలో ఎడిఫిసియో శాంటాలయా, చైనాలో క్యూయీ సిటీ ఫారెస్ట్ గార్డెన్‌లు దీన్ని స్ఫూర్తిగా తీసుకొని నిర్మించినవే. నేటి కాంక్రీట్ జంగిల్స్ మధ్య అవధులు లేని ఆకాశహర్మ్యాల నడుమ ఒక ట్రెండ్... మిద్దె తోట (టెర్రస్ గార్డెన్). పట్టణీకరణ పచ్చని ప్రకృతిని మింగేస్తున్న క్రమంలో మళ్లీ ప్రకృతితో మమేకం కావడానికి మిద్దె తోటలు ఒక ప్రేరణగా నిలిచాయి.

వాస్తవానికి మిద్దె తోటలు పెంచడమనేది ఇప్పుడు కొత్తగా కనిపెట్టిన విషయమేమీ కాదు. క్రీస్తుపూర్వం మెసపొటేమియా నాగరికత నాటికే ఈ పద్ధతి ఉందిట. భవనం అందంగా కనిపించడం కోసం రోమన్లు ముందు వైపు ఇంటి పైకప్పు ప్రత్యేకంగా కట్టించి, దాని మీద మొక్కలు పెంచి... పూల తీగెలు కిందికి వేలాడేలా చేసేవారట. రోమ్, ఈజిప్టు లాంటి చోట్ల పురావస్తు తవ్వకాల్లో బయటపడిన పలు భవనాల్లో ఇలాంటి పైకప్పు తోటలు కనిపించినట్లు చరిత్ర చెబుతోంది. పురాతన ప్రపంచానికి చెందిన ఏడు వింతల్లో ఒకటైన హ్యాంగింగ్ గార్డెన్స్ కూడా ఎత్తైన భవనాల మీద పెంచిన తోటలే. 'ప్రకృతితో కలిసి నడిచే ప్రతి అడుగులో...మనం కోరుకున్నదానికంటే చాలా ఎక్కువే పొందుతాం' అనేది ఒక సామెత. 'ప్రకృతిని మనం రక్షిస్తే... మనల్ని ప్రకృతి రక్షిస్తుంది' అంటారు. మట్టి లేనిదే మానవ మనుగడ లేదు. మట్టి నుంచి దూరమై సిమెంట్ రోడ్లపైన నడుస్తూ, కాంక్రీట్ జంగిల్ మధ్య నివసిస్తూ స్వచ్ఛమైన ప్రకృతి శోభను ఆస్వాదించలేకపోతున్న మనిషికి మిద్దె తోటలు ఒకింత ఊరటనిచ్చాయి. మళ్లీ మట్టితో అనుబంధాన్ని పెంచుతున్నాయి. పట్టణాలలో గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తగ్గిస్తాయి. పక్షులు, తేనెటీగలు, ఇతర పరాగ సంపర్కాలకు ఆవాసాలుగా మారడంతో పాటు జీవవైవిధ్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. సేంద్రియ పద్ధతిలో పెరటితోట, మిద్దె తోటల్లో ఆకుకూరలు, కాయగూరలు, పూలు, పండ్లు సైతం పండిస్తున్నారు.

ఇప్పుడు మిద్దె తోట అనేది ఆరోగ్యంలో భాగమైంది. 'మిద్దెతోట ఆరోగ్యానికి పూలబాట' అంటున్నారు మిద్దెతోటలను సాగు చేస్తున్నవారు. ఎండలు తగ్గి, వర్షాలు పడుతున్నాయి. మిద్దె తోట సాగుకు అనువైన సమయం ఇది. రసాయనాలతో పండించిన కూరగాయలు తినడం కన్నా సహజసిద్ధంగా పండించుకుని తినడంలో గల సంతృప్తి, ఆరోగ్యం వర్ణనాతీతం. రసాయనిక ఎరువుల వల్ల ఎదురయ్యే సమస్యల నుంచి కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోగల్గుతున్నారు. అదీగాక మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అంతేకాదు...మిద్దె తోటల వల్ల భవనాల పైకప్పు జీవిత కాలం కూడా పెరుగుతుందని, ఎంతటి వేసవిలోనైనా ఇంటి లోపల చల్లగా వుంటుందని నిపుణులు చెబుతున్నారు. మిద్దెతోటల పెంపకంతో శరీరానికి మంచి వ్యాయామం, ఆర్థిక వెసులుబాటు... అన్నిటికంటే ముఖ్యంగా మానసిక సంతృప్తి పొందగల్గుతున్నారు. పట్టణీకరణ యొక్క ప్రతికూల ప్రభావాలను, మిద్దెతోటలు సానుకూలపరుస్తూ... ప్రకృతితో మమేకం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుంది. 'వృక్షో రక్షతి రక్షిత:' అన్నారు. మనిషి ప్రకృతితో మమేకమై వృద్ధి చెందగల పచ్చని ప్రదేశాలుగా మిద్దెతోటలను మార్చుకుందాం.

మహనీయుల మాట



మన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, ఎదుటివారి మాటకు కూడా విలువివ్వడం అలవరచుకుంటే జీవితంలో ఒక ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్,
సుప్రసిద్ధ శాస్త్రవేత్త



తెలుగు రాష్ట్రాల్లో బిజెపి రాజకీయ క్రీడ

ప్రస్తుతం

తెలకపల్లి రవి

గత పదిహేను రోజులుగా బిజెపి తెలుగు రాష్ట్రాలలో సాగించిన రాజకీయ విన్యాసాలు వాటికి పరాకాష్టగా ప్రధాని మోడీ పర్యటన, ఇందుకు సమాంతరంగా కొన్ని ప్రాంతీయ పార్టీల పిల్లిమొగ్గలు అవకాశవాదానికి అద్దం పడుతున్నాయి. ఎవరు ఎవరితో కలుస్తున్నారు, ఏ దిశలో పయనిస్తున్నారు అనేదానిపై భిన్న సంకేతాలిస్తూ ప్రజలలో గందరగోళం పెంచుతున్నాయి. ఇదీ వాటి నైజం. మరోవైపున తన జాతీయ వ్యూహాలలో భాగంగా ఈ పార్టీల పట్ల తన వైఖరి గురించి బిజెపి కూడా ఉద్దేశపూర్వకంగానే తికమక సృష్టించింది. ఇంకా కొనసాగిస్తోంది కూడా. వాటివాటి అనుకూల మీడియాలు కూడా తమవైన ఊహాగానాలతో కల్పనా కథలతో కాలక్షేపం చేశాయి. వీటిలో దేనిపైనా వీటి నాయకులు ఇదమిత్థంగా ప్రకటన చేయకుండా అస్పష్టతకే బలం చేకూర్చడం ఇందులో భాగమే. బెంగళూరులో ఈ నెల మూడవ వారంలో జరిగే ప్రతిపక్షాల మలి విడత సమావేశం, బిజెపి ఆధ్వర్యంలో జరిగే ఎన్‌డిఎ విస్తృత సమావేశం వీటికి జాతీయ ప్రతిధ్వనిగా వున్నాయి.

తెలంగాణలో తాము అధికారంలోకి రాబోతున్నామని హడావుడి చేసిన బిజెపి బాగా ముందుగానే చేతులెత్తేయడంతో ఈ ప్రహసనం మొదలైంది. బండి సంజయ్ అధ్యక్షుడైనాక దూసుకుపోతున్నామనీ ఇతర పార్టీల నేతలు క్యూలు కడుతున్నారని పెద్ద హంగామా చేశారు. దుబ్బాక జిహెచ్‌ఎంసి, హుజూరాబాద్ ఎన్నికలలో విజయాలు ఇందుకు నిదర్శనాలుగా చెప్పబడ్డాయి. అయితే ఆ రెండు శాసనసభ ఉప ఎన్నికలలోనూ రఘునందన్, ఈటల రాజేందర్ గెలుపులు ప్రత్యేక పరిస్థితులలో లభించాయనీ, జిహెచ్‌ఎంసి లో సంజయ్ మతతత్వం రెచ్చగొట్టడంతో అధికంగా సీట్లు వచ్చాయని అందరికీ తెలుసు. అయినా కావాలనే ఈ హైప్‌ను పెంచుతూ రావడానికి కొన్ని మీడియా సంస్థలు వ్యూహాత్మకంగా కారణమైనాయి. ఆ ఊపులో కాంగ్రెస్ నుంచి వచ్చి చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ అసెంబ్లీకి రాజీనామా చేసి మునుగోడులో ఉప ఎన్నిక తీసుకొచ్చి భంగపడ్డారు. కాకపోతే ఇక్కడ వామపక్షాలు బలపర్చి వుండకపోతే టిఆర్ఎస్/బిఆర్ఎస్ గెలిచి వుండేది కాదని కూడా తేలిపోయింది. ఈ ఎన్నికకు కాస్త ముందుగా ఆపరేషన్ ఫాంహౌస్‌లో చిక్కిపోయిన బిజెపి బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితను ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో భాగస్వామిగా ఆరోపించి దాడి చేసింది. ఈడీ ఆమెను పలుసార్లు విచారించింది. కవితనే గాక కెసిఆర్‌ను కూడా అరెస్టు చేస్తామన్న స్థాయిలో బండి సంజయ్ వంటి వారు రెచ్చిపోయి మాట్లాడారు. ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను కావాలని ఉసిగొలుపుతున్నారని బిఆర్ఎస్‌తో పాటు సుప్రీం కోర్టులో కేసు వాదించిన కాంగ్రెస్ రాష్ట్రంలో మాత్రం కెసిఆర్ ప్రభుత్వంపై చర్య తీసుకోవాలని విమర్శలు చేస్తూనే వచ్చింది. కర్ణాటక విజయం తర్వాత జోష్ పెరిగినట్టుగా దాడి తీవ్రం చేసింది. బిజెపి చేరికల కమిటీ ఎన్ని తంటాలు పడినా చెప్పుకోదగిన వారెవరూ చేరకపోవడం వాస్తవ పరిస్థితిని వెల్లడించింది. బిఆర్ఎస్ నుంచి నిష్క్రమించిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి వంటివారు కూడా కాంగ్రెస్ లోనే చేరడం బిజెపికి మరీ ఇబ్బందికరంగా మారింది. కెసిఆర్ కూడా తమకు రాజకీయ ప్రత్యర్థి కాంగ్రెస్ తప్ప బిజెపి కాదని పలుసార్లు ప్రకటించారు. కాంగ్రెస్ బిజెపి రెండింటిపైనా సమానంగా విమర్శలు చేసే ఆ పార్టీని పాట్నా సదస్సుకు ఆహ్వానించలేదు కూడా. బిజెపిపై కెసిఆర్ విమర్శల తీవ్రత తగ్గిందనే అభిప్రాయమూ పెరిగింది. ఆ దశలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సమావేశమై కెసిఆర్‌ను కలిసి ఎన్నికల విషయమై స్పష్టతకు రావాలని నిర్ణయానికి వచ్చాయి. బిజెపికి వ్యతిరేకంగా బిఆర్ఎస్‌తో కలిసి పని చేస్తామని ప్రకటించిన కమ్యూనిస్టులు ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలుపుతారని కూడా కొన్ని మీడియాలు రాశాయి. తాము బిజెపికి వ్యతిరేకంగా వుండాలనే బిఆర్ఎస్‌కు చెబుతామనీ, సీట్ల చర్చల కోసం తాముగా అడగబోమని కూడా ఉభయ పార్టీలు ప్రకటించాయి. నిజానికి కేరళలో సిపిఎం ఇప్పటికే విమర్శించినట్టుగా జాతీయ స్థాయిలో బిజెపిని ఓడించాలనే తన లక్ష్యానికి ఆ యా రాష్ట్రాలలో ప్రాంతీయ లౌకిక పార్టీల పట్ల తీసుకోవలసిన వైఖరికి మధ్య కాంగ్రెస్ సమతుల్య వైఖరి తీసుకోలేకపోవడం తెలంగాణ లోనూ వుంది. పైగా బిజెపి, బిఆర్ఎస్ ఒకటేనన్న వైఖరి ముదిరి మొన్న ఖమ్మంలో జరిగిన బహిరంగ సభలో రాహుల్‌గాంధీ దానికి బి-టీమ్‌గా ఆరోపించారు. సహజంగానే దీనిపై పాలక పార్టీ విరుచుకుపడి మీరిద్దరే ఒక టీమ్ అన్నట్టు ఎదురుదాడి చేసింది. ఈ మూడు పార్టీలూ తక్కిన ఇద్దరినీ ఒక టీమ్‌గా విమర్శించడం పరిపాటిగా మారింది.

ఇవన్నీ ఎలా వున్నా బిజెపి రాష్ట్ర నాయకత్వంపై పార్టీలో అంతర్గతంగానే తీవ్ర అసంతృప్తి, అంత:కలహాలు పెరుగుతూనే వచ్చాయి. ఈటల రాజేందర్‌ను అధ్యక్షుడిని చేస్తారని ఒక లాబీ చాలా కాలంగా చెబుతూ వచ్చింది. దాన్ని మరో వర్గం వ్యతిరేకించడంతో మధ్యే మార్గంగా మళ్లీ కిషన్‌రెడ్డిని తీసుకొచ్చారు. అయితే ఈ లోగా విజయశాంతి, జితేందర్‌రెడ్డి, రాజగోపాలరెడ్డి, రఘునందనరావుతో సహ ప్రతి వారూ బహిరంగంగానే ధిక్కార స్వరం వినిపించారు. రఘునందన్ అయితే సంజయ్‌కి రూ.వంద కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. నా వల్లనే పార్టీకి ఊపొచ్చిందని ఆయనా రాజేందర్ పోటీలు పడ్డారు. దాదాపు వారం సాగిన ఈ తంతు కాంగ్రెస్ కలహాలను కూడా మరపించింది. ఈ మొత్తం వ్యవహారం పదవుల కోసమే గాని వీరిలో ఎవరూ మత రాజకీయాలపై అభ్యంతరం పెట్టింది లేదు. బండి సంజయ్‌ని కేంద్రంలోకి తీసుకుంటారని కూడా దాదాపు నమ్మకంగా చెబుతున్నారు. తెలంగాణలో మొదలైన ఈ లొల్లి ఎ.పి కి పాకి అక్కడా అధ్యక్ష మార్పును తెరపైకి తెచ్చింది. సోము వీర్రాజుకు ఎసరు పెట్టింది. ఈ క్రమంలో సత్యకుమార్‌ను చేస్తారని ఒక లాబీ ప్రచారం నడిపింది. తనను తెలుగుదేశం అనుకూలుడుగా ప్రచారం చేసింది మరో వర్గం. టిడిపి నుంచి వచ్చి చేరిన సుజనా చౌదరి వంటి వారి పేర్లు కూడా వినిపించాయి. (సైడ్ లీడ్) చివరకు ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురంధేశ్వరిని అధ్యక్ష పదవిలో నియమించారు. రాష్ట్ర విభజన నిర్ణయం వరకూ కాంగ్రెస్‌లో వుండి తర్వాత బిజెపి లోకి మారిన ఆమె వ్యక్తిగతంగా, కుటుంబపరంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు సరిపడని వ్యక్తిగా భావిస్తారు. బిజెపితో మరోసారి పొత్తు పెట్టుకోవడం కోసం చంద్రబాబు ఆరాటపడుతూ అందుకోసం అమిత్‌షా, నడ్డాలను కూడా కలిసి వచ్చిన నేపథ్యంలో ఈ నియామకం అందుకు విరుద్ధమైన సంకేతాలిచ్చింది. ఈ నిర్ణయం జరిగే సమయంలోనే ఎ.పి ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీలో వుండి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలను కలిసి కొన్ని నిధులు విడుదల కావడం కూడా రాజకీయ జోస్యాలను రక్తికట్టించింది. గోదావరి జిల్లాల్లో వారాహి యాత్ర చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా ఈ పొత్తుల ముచ్చట గందరగోళం పెంచడానికి తన వంతు పాత్ర పోషించారు. ఏతావాతా బిజెపి ద్వంద్వ రాజకీయ క్రీడలో మూడు ప్రాంతీయ పార్టీలు పాచికలుగా ఉపయోగపడ్డాయి. ఎవరితో పొత్తు పెట్టుకోకుండానే అందరి మద్దతు తీసుకోవచ్చనే బిజెపి వ్యూహానికి భూమిక కల్పించాయి. అయితే ఇప్పటికీ ఈ విషయంలో అంతిమ నిర్ణయం మిగిలే వుంది. ఎన్‌డిఎ సమావేశానికి టిడిపి వెళ్తుందని కూడా అనుకూల ఛానళ్ల హడావుడి చేసినా చివరకు ఆహ్వానం రాలేదని ఆ పార్టీయే ప్రకటించాల్సి వచ్చింది. పంజాబ్‌లో అకాలీదళ్ విషయంలోనైతే తాము మళ్లీ ఎన్‌డిఎలో చేరబోమని వారే ప్రకటించారు గాని టిడిపి మాత్రం ఆ పనిచేయడానికి సిద్ధంగాలేదు. వైఎస్ షర్మిల పార్టీ బిజెపికి దగ్గరైనట్టు ఒక దశలో కనిపించగా తర్వాత కాంగ్రెస్‌లో కలిసిపోతుందని, లేదంటే చేతులు కలుపుతుందని కథనాలు కూడా ఎ.పి, తెలంగాణలలో శీర్షికలయ్యాయి. ఎ.పి లో జగన్‌పై ఆమె రాజకీయంగా పోరాడుతుందని కూడా ఆ మీడియా కథనాలిచ్చింది. తాను తెలంగాణకే పరిమితమంటూ ఖండన విడుదల చేసిన షర్మిల కాంగ్రెస్‌తో బంధం విషయం మాత్రం తేల్చలేదు. అయితే వైఎస్ జయంతికి సోనియా గాంధీ ఇడుపులపాయ వస్తారనే వార్తలు నిజం కాకపోవడంతో ఈ కథలు కూడా తేలిపోయినట్టే. సీనియర్ నాయకుడు కెవిపి రామచంద్రరావు వంటివారు కూడా బలపర్చిన ఈ కథనం ఎందుకు విఫలమైందో లేక మరేదైనా మార్పు వుందో చూడవలసిందే. అయినా ఆమె ప్రభావం చాలా పరిమితమే అన్నది ఒకటైతే పాలేరులో పోటీపైనే దృష్టి పెట్టే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది. తెలంగాణలో టిడిపి, జనసేనలతో పొత్తు ప్రసక్తి లేదని కూడా బిజెపి ప్రకటించింది.

చివరగా ప్రధాని మోడీ పర్యటన తరుణంలో బిఆర్ఎస్ నాయకుడు కెటిఆర్ మరోసారి ఆయనపై విమర్శలు సంధించారు. ఈ పర్యటనలో అధికారిక కార్యక్రమాలలో కూడా ముఖ్యమంత్రి కెసిఆర్ పాల్గొనలేదు. బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. తమ పార్టీ సభల్లో ప్రధాని కెసిఆర్ ప్రభుత్వం అవినీతి మయమని తీవ్రంగా దాడి చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సభలలోనూ ఆయన కెసిఆర్ కుటుంబ అవినీతి ఆరోపణలంటూ ప్రస్తావించారు. అవినీతి కోసమే ఢిల్లీ, తెలంగాణ ప్రభుత్వాలు సహకరించుకుంటున్నాయని ఆప్‌ను కూడా రంగంలోకి తెచ్చారు. ప్రతిపక్షాల జాతీయ సమావేశం జరగనున్న నేపథ్యంలోనే మోడీ ఇవన్నీ మాట్లాడారనేది స్పష్టమే. ఒక విధంగా ఇది బిఆర్ఎస్ వారితో కలిసివున్నట్టు కాంగ్రెస్ చేసే ఆరోపణకు సమాధానం కూడా. మోడీతో పాటు సభలో పాల్గొన్న నేతలు కూడా బిఆర్ఎస్‌తో కలిసే ప్రసక్తిలేదని మరీ మరీ చెప్పారు. ఈ విధంగా తెలంగాణ రాజకీయ దృశ్యం మళ్లీ యథాస్థితికి వచ్చినట్టే. కానీ కాంగ్రెస్ మాత్రం తన ఆరోపణ కొనసాగిస్తుంటే బిఆర్ఎస్ ఈ ఉభయులనూ కలిపి ఖండిస్తున్నది. శాసనసభ ఎన్నికలు సమీపించిన సమయంలో బిజెపి అంతర్గత సంక్షోభంలో చిక్కుకోవడం ముందే ఓటమిని అంగీకరించిన చందంగా వుంది. అయినా తామే గెలుస్తామని హడావుడి సాగిస్తూనే వుంది. కాంగ్రెస్ దూకుడు పెరిగినా విజయం సాధించే స్థాయిలో వుందా అనేది ప్రశ్నార్థకమే. ఇక బిఆర్ఎస్ తాజా పరిణామాల దృష్ట్యా ఏ విధమైన కార్యాచరణ స్పష్టత ఇస్తుందోనని పరిశీలకులు ఎదురు చూస్తున్నారు. ఎ.పి లో బిజెపి ప్రభావం నామమాత్రమైనా మూడు ప్రాంతీయ పార్టీలూ అనుకూలంగానే వున్నందున ఎలాంటి రాజకీయ కుయుక్తులకు పాల్పడుతుందనే విషయంలో అప్రమత్తంగా వుండాల్సిందే. ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఎప్పటిలాగే వైసిపి చెబుతున్నా ఇతర కోణాలు చూడవలసిందే. ఇవన్నీ ఒకటైతే ముందస్తు లేదా జమిలి ఎన్నికలంటూ బిజెపి సృష్టించే సందేహాలు కూడా అస్పష్టత పెంచుతున్నాయి. ఈ మొత్తం కమలం కమాల్ ఇప్పట్లో తేలదేమో! ★

ఈటల రాజేందర్‌ను అధ్యక్షుడిని చేస్తారని ఒక లాబీ చాలా కాలంగా చెబుతూ వచ్చింది. దాన్ని మరో వర్గం వ్యతిరేకించడంతో మధ్యే మార్గంగా మళ్లీ కిషన్‌రెడ్డిని తీసుకొచ్చారు. అయితే ఈ లోగా విజయశాంతి, జితేందర్‌రెడ్డి, రాజగోపాలరెడ్డి, రఘునందనరావుతో సహా ప్రతి వారూ బహిరంగంగానే ధిక్కార స్వరం వినిపించారు. రఘునందన్ అయితే సంజయ్‌కి రూ.వంద కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. నా వల్లనే పార్టీకి ఊపొచ్చిందని ఆయనా రాజేందర్ పోటీలు పడ్డారు. దాదాపు వారం సాగిన ఈ తంతు కాంగ్రెస్ కలహాలను కూడా మరపించింది. ఈ మొత్తం వ్యవహారం పదవుల కోసమే గాని వీరిలో ఎవరూ మత రాజకీయాలపై అభ్యంతరం పెట్టింది లేదు.

చివరకు ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురంధేశ్వరిని అధ్యక్ష పదవిలో నియమించారు. రాష్ట్ర విభజన నిర్ణయం వరకూ కాంగ్రెస్‌లో వుండి తర్వాత బిజెపి లోకి మారిన ఆమె వ్యక్తిగతంగా, కుటుంబపరంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు సరిపడని వ్యక్తిగా భావిస్తారు. బిజెపితో మరోసారి పొత్తు పెట్టుకోవడం కోసం చంద్రబాబు ఆరాటపడుతూ అందుకోసం అమిత్‌షా, నడ్డాలను కూడా కలిసి వచ్చిన నేపథ్యంలో ఈ నియామకం అందుకు విరుద్ధమైన సంకేతాలిచ్చింది. ఈ నిర్ణయం జరిగే సమయంలోనే ఎ.పి ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీలో వుండి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలను కలిసి కొన్ని నిధులు విడుదల కావడం కూడా రాజకీయ జోస్యాలను రక్తికట్టించింది. గోదావరి జిల్లాల్లో వారాహి యాత్ర చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా ఈ పొత్తుల ముచ్చట గందరగోళం పెంచడానికి తన వంతు పాత్ర పోషించారు. ఏతావాతా బిజెపి ద్వంద్వ రాజకీయ క్రీడలో మూడు ప్రాంతీయ పార్టీలు పాచికలుగా ఉపయోగ పడ్డాయి. ఎవరితో పొత్తు పెట్టుకోకుండానే అందరి మద్దతు తీసుకోవచ్చనే బిజెపి వ్యూహానికి భూమిక కల్పించాయి.

'ఒకే పింఛన్' అమలు చేస్తారా?

సమస్య

ఎం. అడివయ్య

వికలాంగులకు సామాజిక భద్రత సాధన కోసం ఈ నెల 10న ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద వేలాది మంది వికలాంగులు మహా ధర్నాకు సిద్ధమవుతున్నారు. జూన్ 1 నుండి జులై 9 వరకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుండి త్రిపుర వరకు సామాజిక భద్రత, అంత్యోదయ కార్డులు, ఉపాధి హామీ చట్టంలో పని కల్పించాలని, దేశ వ్యాప్తంగా ఒకే పింఛన్ అమలు చేయాలని గ్రామ గ్రామాన కరపత్రాలు, పోస్టర్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. మండల, జిల్లా కేంద్రాల్లో సదస్సులు, సెమినార్లు, చర్చావేదికలు నిర్వహించి చలో ఢిల్లీకి సన్నద్ధమయ్యారు. వాస్తవానికి వికలాంగుల సమస్యలు పాలకులకు పట్టింపు లేదు. వారి సంఖ్యను కూడా తక్కువ చూపే ప్రయత్నం జరుగుతున్నది. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం (7 రకాల వైకల్యాల ప్రకారం) 2.68 కోట్ల మంది వికలాంగులున్నారు. వీరిలో పురుషులు 1.50 కోట్ల మంది, స్త్రీలు 1.18 కోట్ల మంది, గ్రామీణ ప్రాంతంలో 69.4 శాతం, పట్టణ ప్రాంతంలో 30.6 శాతం మంది నివసిస్తున్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాల ప్రకారం దేశ జనాభాలో 10 నుండి 15 శాతం మంది వికలాంగులు ఉంటారని అంచనా. కేంద్ర ప్రభుత్వ వికలాంగుల సాధికారత విభాగం వెల్లడించిన రిపోర్ట్ ప్రకారం 49.5 శాతం మంది ప్రభుత్వ పథకాలే పొందడం లేదు. ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందం ఆర్టికల్ 23 ప్రకారం వైకల్యంతో బాధపడుతున్న వికలాంగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి జీవించే హక్కు, సమాజంలో గౌరవంగా అందరితో కలిసి జీవించే హక్కుతో పాటు స్వతహాగా నిర్ణయాలు తీసుకునే హక్కును కల్పించింది. సమాజంలో వికలాంగుల పట్ల వివక్షత, అవమానాలు, అన్యాయాలు కొనసాగుతున్నాయి. మహిళా వికలాంగులు, బాలికలు, మూగ చెవిటి, మానసిక, మహిళా వికలాంగులపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అంగవైకల్యం కలిగిన వారికి సమాజంలో, ఇంట్లో సైతం గుర్తింపు లేదు. వికలాంగులను ఆదరించాల్సిన సమాజం చీదరించు కుంటుంటే...కన్నవారు సైతం కాదు పొమ్మని వెలివేస్తుంటే దిక్కుతోచని స్థితిలో అవమానాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వీరికి మనోధైర్యం కల్పించేందుకుగాను సామాజిక భద్రత ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం ఉన్నది.

ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం 2008లో సంతకం చేసింది. 1995 పిడబ్ల్యుడి చట్టం స్థానంలో వికలాంగులకు మారిన పరిస్థితుల నేపథ్యంలో నూతన చట్టం చేయాలని 2011 నుండి దేశవ్యాప్తంగా ఎన్‌పిఆర్‌డి నేతృత్వంలో అనేక ఉద్యమాలు జరిగాయి. పోరాటాల ద్వారా 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం వచ్చింది. చట్టం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాన్చుడు ధోరణి అనుసరిస్తున్నాయి. 2016 ఆర్‌పిడబ్ల్యుడి చట్టంలోని సెక్షన్ 89, సెక్షన్ 92, సెక్షన్ 93 లకు సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే దానికి వ్యతిరేకంగా చేసిన పోరాటాల ద్వారా కేంద్రం వెనక్కు తగ్గింది. నేషనల్ ట్రస్ట్, మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్, ఆటిజం చట్టం వంటివి మాత్రం అమలు చేయడం లేదు. నేషనల్ పాలసీ రూపొందించిన అమలుకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమం చేసి ప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొట్టడం జరిగింది. చట్టాల అమలును పర్యవేక్షించాల్సిన ఆర్‌పిడి చీఫ్ కమిషనర్, నేషనల్ ట్రస్ట్ కమిషనర్ పోస్టులు నేటికీ ఖాళీగా వున్నాయి. చట్టాల అమలు పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేదనడానికి నిదర్శనమిది. వికలాంగులకు అంత్యోదయ కార్డులు జారీ చేయాలని చెప్పిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని 2011లో రాజ్యసభలో బృందాకరత్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే 2012 నుండి దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో అంత్యోదయ కార్డులు పంపిణీ చేశారు. కానీ ఇప్పటికీ అనేక రాష్ట్రాల్లో వికలాంగులు అంత్యోదయ కార్డులకు నోచుకోలేదు.

వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో తెచ్చిన ఉపాధి హామీ చట్టంలో వికలాంగులకు స్థానం లేదు. ఎన్నో రోజులుగా డిమాండ్ చేసినప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదు. వికలాంగులకు ప్రత్యేక జాబ్‌కార్డులు జారీ చేయాలి. 200 రోజులు పని కల్పించి వేతనం రూ.600కు పెంచాలి. దేశవ్యాప్తంగా వికలాంగులకు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క రకమైన పెన్షన్ స్కీమ్ అమలు అవుతుంది. రూ.300 నుంచి మొదలై రూ.3 వేల వరకు ఉంటున్నది. వీరు ఇంత తక్కువ నగదుతో కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారు? ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే తిండి అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, దేశవ్యాప్తంగా వికలాంగులకు ఒకే పెన్షన్ అమలు చేస్తామని చెప్పే ధైర్యం ఉందా? ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలి. ఎలాంటి షరతులు, ఆదాయ పరిమితులు లేకుండా 40 శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలి. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు వారి సహాయకులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో మహిళా వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. మహిళా వికలాంగులకు స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలి. ఈ హక్కుల సాధనకు వికలాంగులందరూ ఐక్యమవ్వాలి. సామాజిక భద్రత సాధించేందుకు పోరాడాలి.

(వ్యాసకర్త ఎన్‌పిఆర్‌డి జాతీయ ఉపాధ్యక్షులు,
సెల్ : 9490098713)

వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో తెచ్చిన ఉపాధి హామీ చట్టంలో వికలాంగులకు స్థానం లేదు. ఎన్నో రోజులుగా డిమాండ్ చేసినప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదు. వికలాంగులకు ప్రత్యేక జాబ్‌కార్డులు జారీ చేయాలి. 200 రోజులు పని కల్పించి వేతనం రూ.600కు పెంచాలి. దేశవ్యాప్తంగా వికలాంగులకు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క రకమైన పెన్షన్ స్కీమ్ అమలు అవుతుంది. రూ.300 నుంచి మొదలై రూ.3 వేల వరకు ఉంటున్నది. వీరు ఇంత తక్కువ నగదుతో కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారు? ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే తిండి అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, దేశవ్యాప్తంగా వికలాంగులకు ఒకే పెన్షన్ అమలు చేస్తామని చెప్పే ధైర్యం ఉందా?

జనవాక్యం

ఎల్నినో.. ఎన్నాళ్లిలా...

ప్రస్తుతం ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను చూస్తుంటే ఎల్నినో ప్రభావం స్పష్టంగా తెలుస్తోంది. దీనివల్ల కరువు నుంచి అతి తీవ్ర కరువు ఏర్పడే అవకాశం ఉంది. భూతాపం కూడా రెండు డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల వల్ల పంట విత్తు వేయడం నెల రోజులు ఆలస్యం అయ్యింది. పంటల విస్తీర్ణంతో పాటు, దిగుబడి కూడా తగ్గే అవకాశం ఉంది. పెరిగిన జనాభా అవసరాలకనుగుణంగా ఆహార ధాన్యాల దిగుబడి తగ్గి, ఆహార ధాన్యాల కొరత ఏర్పడి, ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ఆహార ధాన్యాల ధరలను కట్టడి చెయ్యాలంటే ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి పంటలను కొనుగోలు చేసి ప్రజలకు సరసమైన ధరలకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

- పాలెప్పగారి రంగనాథ్ యాదవ్,
సింగెపల్లి.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

జాతీయ గీతానికి నిలబడలేదని 11 మందికి వారం జైలు శిక్ష

- జమ్మూకాశ్మీర్‌లో ఘటన

జమ్మూకాశ్మీర్ : జాతీయ గీతం వస్తున్న సందర్భంలో నిలబడకపోవటంతో జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో 11 మందికి వారం పాటు జైలుశిక్ష పడింది. గతనెల 25న జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) మనోజ్ సిన్హా హాజరైన ఒక కార్యక్రమంలో ఇది చోటు చేసుకున్నది. అలాగే, బాధ్యులైన కొందరు పోలీసు అధికారులనూ సస్పెండ్ చేయటం గమనార్హం. ఈ ఘటన గురించి సిన్హా గుర్తించటంతో అధికారులు పై చర్యలకు దిగారు. 11 మందిని వారం పాటు నిర్బంధించాలని శ్రీగర్‌లోని ఖన్యార్ తహసీల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు ఈనెల 3న పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ గీతాన్ని అవమానపరిచినందుకు ఆ 11 మందిపై చర్యలు తీసుకున్నారంటూ వస్తున్న వార్త కథనాలు అవాస్తవమని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ నడిపి.. నాట్లు వేసి...

- హర్యానా రైతులతో రాహుల్

సోనేపట్ : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ శనివారం హర్యానాలోని సోనేపట్ జిల్లా రైతులతో మమేకమయ్యారు. బరోడా, మదీనా ప్రాంతాలలో వ్యవసాయ క్షేత్రాలలోకి వెళ్లారు. కొద్దిసేపు ట్రాక్టర్ నడిపారు. రైతులతో కలిసి వరి పొలంలో నాట్లు వేశారు. అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీ నుంచి హిమాచల్‌ప్రదేశ్ వెళుతూ మార్గమధ్యంలో ఆయన పంట పొలాల వద్ద ఆగారు. రాహుల్ తమ పొలాల్లోకి రావడం ఆశ్చర్యాన్ని కలిగించిందని, తొలుత ఆయనను గుర్తించలేదని సంజయ్ కుమార్ అనే రైతు తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారని, తమతో కలిసి అల్పాహారం తీసుకున్నారని చెప్పారు. కాగా రాహుల్‌కు సంఘీభావంగా ఈ నెల 12న మౌనదీక్ష చేపట్టాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వివిధ రాష్ట్రాలకు చెందిన పార్టీ అధ్యక్షులకు లేఖలు రాశారు. పరువునష్టం కేసులో రాహుల్‌కు విధించిన శిక్షపై స్టే ఇచ్చేందుకు గుజరాత్ హైకోర్ట్ నిరాకరించిన నేపథ్యంలో ఆయన ఈ లేఖలు రాశారు. రాహుల్ వెనుక లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, కోట్లాది మంది భారత ప్రజలు ఉన్నారని చాటడానికి ఈ దీక్షలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధానులలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

సిసోడియా ఆస్తులు జప్తు

- రూ.52 కోట్ల అటాచ్

న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆయన భార్య సీమ, ఇతరులకు చెందిన రూ.52.24 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. సిసోడియాకు, ఆయన భార్యకు చెందిన రెండు స్థిరాస్తులను, చరియట్ ప్రొడక్షన్ మీడియా ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాజేష్ జోషి, గౌతమ్ మల్హోత్రాలకు చెందిన భూమి, ఫ్లాట్లను స్వాధీనం చేసుకున్నామని ఈడీ తెలిపింది. ఈ స్థిరాస్తుల విలువ రూ.7.29 కోట్లు. ఇక రూ.44.29 కోట్ల చరాస్తుల విషయానికి వస్తే సిసోడియా బ్యాంక్ డిపాజిట్లు (రూ.11.49 లక్షలు), బ్రిండ్కో సేల్స్ ప్రయివేట్ లిమిటెడ్ (రూ.16.45 కోట్లు), ఇతర ఆస్తులను అటాచ్ చేశారు. ఇప్పటి వరకూ ఈ కేసులో రూ.128.78 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. సిసోడియాకు సన్నిహితుడిగా భావిస్తున్న ఢిల్లీ వ్యాపారవేత్త దినేష్ అరోరాను అరెస్ట్ చేసిన మర్నాడే ఈ ఆస్తుల జప్తు జరిగింది. కాగా సిసోడియా ప్రతిష్టను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ నేత అతిషి మర్లేనా ఆరోపించారు. సిసోడియా 18 సంవత్సరాల క్రితం ఒక ఫ్లాటు కొనుగోలు చేశారని, 2018లో మరొకటి కొన్నారని, ఎక్సైజ్ పాలసీని రూపొందించడానికి ముందే వీటి కొనుగోలు జరిగిందని ఆయన చెప్పారు.

17న హర్యానాలో రైతుల నిరసన

చండీగఢ్ : దెబ్బతిన్న పంటలకు తగిన నష్టపరిహారం ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని సంయుక్త కిసాన్‌మోర్చ (ఎస్‌కేఎం) హర్యానా రాష్ట్ర శాఖ నిర్ణయించింది. సబ్-డివిజన్ స్థాయిలో ఈ నిరసన ప్రదర్శనలు చేపడతారు. 'పంటల రిజిస్ట్రేషన్‌ను ప్రైవేటు బీమా కంపెనీలు అనుమతించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల మేర పంట నష్టానికి సంబంధించిన బీమా క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క మహేంద్రఘర్ జిల్లాలోనే 17 వేల మంది రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నష్టపరిహారం కోసం గత కొన్ని నెలలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇతర జిల్లాలలో కూడా ఇదే పరిస్థితి' అని ఆల్ ఇండియా కిసాన్‌సభ (ఏఐకేఎస్) సీనియర్ ఉపాధ్యక్షుడు ఇందర్‌జిత్ సింగ్ చెప్పారు. రైతులు తమ పంటలకు బీమా సౌకర్యం పొందేందుకు ప్రీమియంలు చెల్లించినప్పటికీ నష్టపరిహారం పొందలేకపోతున్నారని ఆయన తెలిపారు.

రోహ్‌తక్‌లో శుక్రవారం జరిగిన ఎస్‌కేఎం సమావేశంలో ఆందోళన కార్యక్రమాన్ని ఖరారు చేశారు. పంటలకు కనీస మద్దతు ధర పొందడం, రుణాల నుండి రైతులకు విముక్తి కల్పించేందుకు ఒక విధానాన్ని రూపొందించడం వంటి వ్యవసాయ సంబంధమైన డిమాండ్ల సాధన కోసం వారు భవిష్యత్ కార్యాచరణను కూడా ఖరారు చేశారు.

నీళ్ల భారం బాలికలు, మహిళలదే!

- ప్రతి పది ఇళ్ళకు ఏడు ఇళ్ళలో ఇదే పరిస్థితి
- ఐక్యరాజ్య సమితి అధ్యయనంలో వెల్లడి

ఐక్యరాజ్య సమితి : నీటి సదుపాయం లేని ఇళ్ళలో జీవించే 180కోట్ల మంది ప్రజలకు ప్రధానంగా తాగునీరు తీసుకొచ్చేది మహిళలు, బాలికలేనని యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థలు వెలువరించిన తాజా నివేదికలో పేర్కొన్నాయి. సాధారణంగా ప్రతి పది ఇళ్ళకు గానూ ఏడు ఇళ్ళలో 15ఏళ్ళు అంతకు పైబడిన బాలికలు, మహిళలు నీటిని మోసుకువస్తారని ఆ నివేదిక పేర్కొంది. ప్రతి పది ఇళ్ళకు గానూ మూడు ఇళ్ళల్లో నీటిని మోసుకువచ్చే బాధ్యత పురుషులదిగా వుంది. ఈ నీటిని తీసుకురావడం కోసం సుదూర ప్రాంతాలకు కాలినడకన వెళ్లడం

సర్వసాధారణమైన అంశంగా వుంటుంది. దీనివల్ల వారికి చదువుకోవడానికి సమయం తగ్గిపోతుందని, లేదా ఇతర పనులు చేసుకోవడానికి, విశ్రాంతి తీసుకునే సమయం కోల్పోతారని నివేదిక పేర్కొంది. నీటిని మోసుకువచ్చే క్రమంలో పొంచి వుండే ప్రమాదాలు, గాయాల గురించి ఇక వేరే చెప్పనక్కర్లేదు. ఇప్పటికి కూడా 50కోట్ల మందికి పైగా ప్రజలు ఇతర కుటుంబాలతో కలిసి తమ పారిశుధ్య సదుపాయాలను పంచుకోవాల్సి వస్తోంది. దీనివల్ల మహిళల గోప్యత, భద్రత దెబ్బతింటోంది. అందుబాటులో వున్న డేటా ప్రకారం, 51 దేశాల్లో నిరుపేద కుటుంబాల్లోని మహిళలు, బాలికలు, వికలాంగులు ఇటువంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని నివేదిక పేర్కొంది. "2000-2022 మధ్య కాలంలో ఇళ్ళకు తాగునీరు, పారిశుధ్యం, శుభ్రతపై పురోగతి" అన్న శీర్షికతో జరిగిన అధ్యయనంలో 172 పేజీల నివేదిక వెలువడింది. లింగ సమానత్వానికి దోహదపడే ఈ అంశంలో పురోగతి సాధించడానికి మరింత కృషి అవసరమని పేర్కొంది. జాతీయ గణాంకాలు అందుబాటులో వున్న దేశాల్లో లింగ అసమానతలపై కూలంకష విశ్లేషణ జరిగింది. తాగునీరు, పారిశుధ్యం, శుభ్రత (వాష్) అందుబాటులో లేక మహిళలు పడే ఇబ్బందులను ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. ఇళ్ళ వద్ద కనీసం సబ్బు, నీరుతో తమ చేతులు కడుక్కోలేని వారు దాదాపు 200కోట్ల మంది వున్నారని నివేదిక అంచనా వేసింది. అయితే, 2015-2022 మధ్య కాలంలో వాష్‌కు సార్వజనీన లభ్యత సాధించడం దిశగా కొంత పురోగతి చోటు చేసుకుందని అధ్యయనంలో వెల్లడైంది.

మణిపూర్‌లో చల్లారని హింస

- తాజా అల్లర్లలో నలుగురు మృతి
- మృతుల్లో ఒక పోలీసు
- రాష్ట్రంలో ఇప్పటికీ అదుపులోకి రాని శాంతిభద్రతల పరిస్థితులు

ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో అల్లర్లు తగ్గుముఖం పట్టటం లేదు. రాష్ట్రంలో గత 24 గంటల్లో బిష్ణుపూర్, చురచంద్‌పూర్ జిల్లాల మధ్య సరిహద్దు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు సంఘటనలలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒక పోలీసు, మరొక యువకుడు ఉన్నారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం సాయంత్రం అనుమానిత ఉగ్రవాదులతో జరిగిన కాల్పుల్లో పోలీసు మరణించగా, ఉదయం మరో ముగ్గురు మరణించారు. గత రెండు నెలలుగా ఈ రెండు జిల్లాల మధ్య సరిహద్దు ప్రాంతాల్లో హత్యలు, హింస, దహన ఘటనలు పెరిగాయి.

ఆర్మీ వర్గాల సమాచారం ప్రకారం.. బిష్ణుపూర్ జిల్లా పరిధిలోని కంగ్వాయ్ ప్రాంతం రెండు వర్గాలకు దగ్గరగా ఉండటంతో అది సున్నితమైన ప్రాంతంగా ఉన్నది. భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో 'బఫర్ జోన్'ను సృష్టించాయి. పరిస్థితిని తీవ్రతరం చేయకుండా నిరోధించడానికి భారీ సంఖ్యలో బలగాలు మోహరించాయి. అయితే రెండు వైపుల నుంచి దుండగులు ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకోవడానికి కొండ ప్రాంతాలు, లోయ ప్రాంతాల్లోని గ్రామాల గుండా చొరబడతారు. "శుక్రవారం రాత్రి నుంచి రెండు వైపుల నుంచి ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. ఈ గుంపులు బయటి నుంచి గుమిగూడాయి. తిరిగి వెళ్లాలన్న స్థానికుల అభ్యర్థనకు వారు లొంగలేదు. భద్రతా దళాలు సంయుక్తంగా ప్రతిస్పందించాయి. అయితే, కాంగ్వాయ్, సాంగ్డో, అవాంగ్ లేఖాయ్ గ్రామాల నుంచి స్టాండ్-ఆఫ్ పరిధుల నుంచి ఇరు పక్షాల దుండగులు ఒకరిపై ఒకరు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మతి చెందడంతో పాటు మరికొందరికి గాయాలయ్యాయి" అని గ్రౌండ్ ఆపరేషన్‌లో పాల్గొన్న సీనియర్ భద్రతా అధికారి తెలిపారు.

బలగాలు మోహరించినా రాష్ట్రంలోని కొన్ని చోట్ల పరిస్థితి ఉద్రిక్తంగానే ఉన్నది. కాల్పుల సంఘటనలు నివేదించబడ్డాయి. గత 24 గంటలుగా కొన్ని చోట్ల గుంపులు గుమిగూడడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, చురచంద్‌పూర్, బిష్ణుపూర్, కక్చింగ్ జిల్లాల్లో దుండగులు, ఉగ్రవాదులు ఏర్పాటు చేసిన 18 అక్రమ బంకర్‌లను శుక్రవారం మణిపూర్ పోలీసులు, కేంద్ర భద్రతా బలగాల సంయుక్త బందం ధ్వంసం చేసింది. గడిచిన 24 గంటల్లో దాదాపు 50 అక్రమ బంకర్లను ధ్వంసం చేశారు. గత 24 గంటల్లో, ఇంఫాల్ తూర్పు జిల్లాలో ఐదు అధునాతన ఆయుధాలు, 74 రకాల మందుగుండు సామగ్రి మరియు ఐదు అత్యంత పేలుడు హ్యాండ్ గ్రెనేడ్‌లు స్వాధీనం చేసుకున్నారు. మణిపూర్‌లోని వివిధ జిల్లాల్లో కొండ, లోయలో సుమారు 126 చెక్‌పాయింట్లు ఏర్పాటు చేశారు.వివిధ జిల్లాల్లో చట్టాలను ఉల్లంఘించినందుకు 270 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్రంలో పరిస్థితి అధ్వాన్నం
మణిపూర్ మాజీ గవర్నర్ ఆందోళన

మణిపూర్ మాజీ గవర్నర్ గుర్బచన్ జగత్ మణిపూర్‌లో నెలకొన్న అల్లకల్లోల పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వార్తసంస్థతో ఆయన మాట్లాడుతూ.. పంజాబ్, జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాల్లో నెలకొన్న ఘర్షణల కంటే ఈశాన్య రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉన్నదని తెలిపారు. జమ్మూకాశ్మీర్, పంజాబ్‌లో ఐపీఎస్ అధికారిగా ఆయన పని చేశారు. " రాష్ట్రవ్యాప్తంగా పోలీసు స్టేషన్‌లు, పోలీసు ఆయుధాల మీద దాడులు జరిగాయి. వేలాది తుపాకీలు, భారీ మొత్తంలో మందుగుండు సామగ్రిని దోచుకున్నారు. ఇలా జమ్మూకాశ్మీర్, పంజాబ్, ఢిల్లీ, గుజరాత్‌లలో కఠిన సమయాల్లోనూ జరగలేదు. దొంగ ఆయుధాలు రాష్ట్ర భద్రతా దళాలకు సవాలుగా కొనసాగుతాయి" అని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో వందమందికి పైగా మరణించారనీ, అనేకమంది గాయపడ్డారని చెప్పారు. వేలాది ఇండ్లు, గ్రామాలు కాలిపోయాయని అన్నారు. ప్రజలు జీవనోపాధి కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

బిబిసి, వికీమీడియాలకు సమన్లు

- పరువు నష్టం కేసులో జారీ చేసిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2002 గుజరాత్ అల్లర్లలో ప్రధాని మోడీ పాత్ర ఉన్నదని ఆరోపించిన డాక్యుమెంటరీకి సంబంధించిన పరువు నష్టం కేసులో ఢిల్లీ కోర్టు.. బిబిసి, వికీమీడియా, డిజిటల్ లైబ్రరీ ఇంటర్నెట్ ఆర్కైవ్‌లకు తాజా సమన్లు జారీ చేసింది. బిజెపి నాయకుడు బినయ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పరువు నష్టం ఫిర్యాదుపై న్యాయస్థానం పై విధంగా స్పందించింది.

' ఇండియా: ది మోడీ క్వశ్చన్' డాక్యుమెంటరీని భారత్‌లో అధికారికంగా విడుదల చేయనప్పటికీ.. వికీపీడియా పేజీ దానిని చూడటానికి లింక్‌లను అందిస్తున్నదనీ, కంటెంట్ ఇప్పటికీ ఇంటర్నెట్ ఆర్కైవ్‌లో అందుబాటులో ఉన్నదని బీజేపీ నాయకుడు తన ఫిర్యాదులో ఆరోపించారు. వికీమీడియా ఫౌండేషన్ వికీపీడియా వెబ్‌సైట్‌కు నిధులు సమకూరుస్తుంది. వికీమీడియా, ఇంటర్నెట్ ఆర్కైవ్ రెండూ అమెరికన్ కంపెనీలు. బీబీసీ ఒక బ్రిటిష్ మీడియా సంస్థ. ఈ ఏడాది మే 3న కోర్టు మొదట సమన్లు జారీ చేసినప్పుడు.. యూఎస్, యూకేలలో ఉన్న రెండు విదేశీ సంస్థల న్యాయవాదులు తమపై పరువునష్టం కేసును డీల్ చేసే అధికారం లేదని చెప్పారు. హేగ్ కన్వెన్షన్, భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. విదేశీ దేశాలలో సమన్లు లేదా నోటీసులు న్యాయ వ్యవహారాల శాఖ, న్యాయ మరియు న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా మాత్రమే అమలు చేయబడతాయని అదనపు జిల్లా జడ్జి రుచికా సింగ్లా వివరించినట్టు సమాచారం. అందువల్ల, రెండూ విదేశీ సంస్థలు అని గుర్తించిన తర్వాత కేంద్ర న్యాయ, న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా తాజా సమన్లు జారీ చేయబడ్డాయి.

ఢిల్లీలో భారీ వర్షాలు

- 20 ఏళ్లలో రికార్డు స్థాయి వర్షపాతం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. శనివారం ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకూ 126.1 మీమీ వర్షపాతం నమోదయింది. 20 ఏళ్లలో 24 గంటల వర్షపాతంలో ఇదే రికార్డు అని అధికారులు తెలిపారు. 2003 జులై 10న 133.4 మీమీ వర్షపాతం కురిసిందని, తరువాత ఇదే అత్యధికమని అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి పలు చోట్ల రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. ఆదివారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశ ముందని హెచ్చరిస్తూ భారత వాతావరణ శాఖ అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.భారీ వర్షానికి అనేక ప్రాంతాల్లో రహదారులు నీటమునగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డారు. అండర్‌పాస్‌ల్లోకి నీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇండియాగేట్, ప్రగతి మైదాన్, నోయిడా మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు అవస్థలు పడ్డారు. అత్యంత రద్దీగా ఉండే కన్నౌట్ ప్యాలెస్‌లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

వలసలపై కుదరని ఏకాభిప్రాయం!

- కుప్పకూలిన డచ్ ప్రభుత్వం
- ప్రధాని రాజీనామా

ది హేగ్ : డచ్ ప్రభుత్వం శుక్రవారం కుప్పకూలిపోయింది. వలసలను ఎలా అరికట్టాలనే అంశంపై నాలుగు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో నెదర్లాండ్స్ ప్రధాని మార్క్ రూటె తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈ ఏడాది చివరిలో ఎన్నికలు నిర్వహించడానికి మార్గం సుగమమైందని భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు రూటె ప్రభుత్వం ఆపద్ధర్మ ప్రభుత్వంగా వ్యవహరిస్తుంది. "వలస విధానాలపై సంకీర్ణ భాగస్వాముల మధ్య భిన్నమైన అభిప్రాయాలు వున్నాయి. ఇందులో రహస్యమేమీ లేదు." అని రూటె విలేకర్లతో వ్యాఖ్యానించారు. తమ మధ్య విభేదాలను పరిష్కరించుకోలేమని నిర్ధారణకు రావడంతో దురదృష్టవశాత్తూ ఈ నిర్ణయానికి రావాల్సి వచ్చిందని అన్నారు. అందువల్లే మంత్రివర్గం రాజీనామా లేఖను రాజుకు రాతపూర్వకంగా అందచేశానని చెప్పారు. ఈలోగా తాజాగా ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీలు పిలుపిచ్చాయి. తక్షణమే ఎన్నికల జరగాలని యాంటీ ఇమ్మిగ్రేషన్ పార్టీ ఫర్ ఫ్రీడమ్ నేత గీర్ట్ వైల్డర్స్ ట్వీట్ చేశారు. గ్రీన్ లెఫ్ట్ నేత జెస్సీ క్లావెర్ కూడా ఎన్నికలకై పిలుపిచ్చారు. ఈ దేశానికి దిశా నిర్దేశం మారాల్సిన అవసరం వుందని వ్యాఖ్యానించారు. బుధ, గురువారాల్లో వరుసగ అర్ధరాత్రులు వరకు సమావేశమైనా శరణార్థుల విధానంపై ఒక ఒప్పందానికి రాలేకపోయారు. దాంతో ఇక సంకీర్ణంలో కలిసి వుండలేమని శుక్రవారం ఉదయం జరిగిన సమావేశంలో అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు. మార్క్ రూటెకి చెందిన పీపుల్స్ పార్టీ ఫర్ ఫ్రీడమ్ అండ్ డెమోక్రసీ, క్రిస్టియన్ డెమోక్రాట్లు శరణార్థులపై కఠిన చర్యలు తీసుకునేందుకు మొగ్గు చూపుతుండగా, డి66, క్రిస్టియన్ యూనియన్‌లు వ్యతిరేకిస్తున్నాయి.

ఉక్రెయిన్ యుద్ధానికి 500 రోజులు!

- సైనికులను ప్రశంసించిన జెలెన్స్కీ

కీవ్ : రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం ఆరంభమై శనివారానికి 500రోజులు గడిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ తమ సైనికులను ప్రశంసించారు. ఈ మేరకు నల్ల సముద్ర దీవి అయిన స్నేక్ ఐలాండ్ నుండి ఒక వీడియో విడుదల చేశారు. రష్యా దాడి నేపథ్యంలో ఉక్రెయిన్ ప్రతిఘటనా సామర్ధ్యానికి ఈ దీవి ఒక ప్రతీకగా నిలిచింది. ఈ దీవిపై తిరిగి పట్టు సాధించడమనేది ఉక్రెయిన్ సైనిక పాటవానికి గొప్ప నిదర్శనంగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. తమ భూభాగంలోని ప్రతి అంగుళాన్ని తిరిగి సాధించి తీరుతామని అన్నారు. విజయం సాధించిన ఈ నేల నుండే ఈ 500రోజులుగా పోరు సల్పుతున్న మన సైనికులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని జెలెన్స్కీ ఆ సందేశంలో పేర్కొన్నారు. "ఈ యుద్ధంలో మనం ఖచ్చితంగా విజయం సాధించి తీరుతాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

గతేడాది ఫిబ్రవరి 24న మాస్కో దాడులు ఆరంభించిన రోజే స్నేక్ ఐలాండ్ దీవిని రష్యా బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఉక్రెయిన్‌లో అతిపెద్ద ఓడరేవు అయిన ఒడెశాపై దాడి చేయడానికి ఈ దీవి ఒక గ్రౌండ్‌గా ఉపయోగపడుతుందనే ఆలోచనతో దీన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దీవిలోని ఉక్రెయిన్ బలగాలను తొలుత రష్యా బందీగా చేసినా, తర్వాత ఖైదీల మార్పిడి భాగంగా వారిని విడుదల చేశారు. ఈ దీవిని తీసుకున్న తర్వాత ఉక్రెయిన్ సైన్యం భారీగా అక్కడ గల రష్యా దళంపై బాంబుదాడులు వేసింది. దాంతో అక్కడనుండి జూన్ 30న రష్యన్ సైనికులు వెనక్కి మరలాల్సి వచ్చింది.

63లక్షల మంది శరణార్థులు
9వేల పౌరుల మరణాలు

గత 500రోజులుగా సాగుతున్న ఈ యుద్ధం కారణంగా 63లక్షల మంది శరణార్థులయ్యారు. వీరిలో ప్రధానంగా మహిళలు, పిల్లలే వున్నారు. 9వేలమంది ఉక్రెయిన్ పౌరులు మరణించారు. ఇంకా ఈ సంఖ్య ఎక్కువే వుండవచ్చని భావిస్తున్నారు. గాయపడిన వారి సంఖ్య 15,779గా వుందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం పేర్కొంది. ఇరు పక్షాల వైపు జరిగిన సైనిక మరణాలను నిర్ధారించడం కష్టసాధ్యంగా మారింది. కీవ్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లెక్కల ప్రకారం 14,300డాలర్ల మేరకు నష్టం వాటిల్లిందని అంచనా. ఉక్రెయిన్ భూభాగంలో 20శాతం కన్నా తక్కువ భూభాగమే రష్యా అధీనంలో వుందని అంచనా వేస్తున్నారు.

దేశభక్తి పేరుతో ద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ రంగంలో వుండటంతో ఆర్థిక సంక్షోభం దేశాన్ని తాకలేకపోయిందని గుర్తు చేశారు. అలాంటి బలమైన బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కంకణం కట్టుకుందన్నారు. దేశంలో బ్యాంకింగ్ రంగానికి వందేళ్ల చరిత్ర వుందని తెలిపారు. 1935 నుండి 1969 వరకు బ్యాంకులన్నీ దివాళా తీసి ప్రజల డిపాజిట్లకు రక్షణలేని పరిస్థితి వుండేదన్నారు. 1969 తర్వాత బ్యాంకులను జాతీయం చేశాక సేవలు క్షేత్రస్థాయిలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాయని తెలిపారు. బలమైన బ్యాంకింగ్ రంగాన్ని బిఎస్ఎన్ఎల్ తరహాలో నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. బ్యాంకు ఉద్యోగులు మరింత సంఘటితంగా బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. బెఫి రాష్ట్ర అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభ ప్రారంభసభలో రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బిక్షమయ్య, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సౌత్ జోన్ సహాయ కార్యదర్శి జి కిశోర్‌కుమార్, బెఫి తెలంగాణ నాయకులు సతీష్, నాయకులు అజయ్‌కుమార్, కె సత్యరంజన్, ఎస్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.

బెఫి రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక



విజయవాడలో జరిగిన బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫి) 8వ రాష్ట్ర మహాసభల్లో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. బెఫి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా వేణుగోపాల్, అజయ్ కుమార్, కోశాధికారిగా ఎస్ రంగారావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా కె సత్యరంజన్, ఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షులుగా ఎంవిఎస్ ప్రసాద్, శరత్ చంద్ర శ్రీనివాస్, కె హరికృష్ణ, ఎం క్రాంతి, కె సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్రటరీలుగా అప్పలరెడ్డి, వివిఎన్ రాజారెడ్డి, అనూప్ శ్రీరామ్, ఎస్‌వి రమణతో ఈ మహాసభలో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికైంది.

ఢిల్లీ వరకు కెసిఆర్ అవినీతి పాకింది

- వరంగల్ సభలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బహిరంగ సభలో మాట్లాడుతున్న మోడీ

కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే సిఎం కెసిఆర్ పని అని, కెసిఆర్ కుటుంబం అవినీతి ఢిల్లీ వరకు పాకిందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. శనివారం హన్మకొండ జిల్లాలో పర్యటించిన మోడీ..పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హనుమకొండలో రూ.6,109 కోట్ల విలువైన పనులకు, రూ.521 కోట్లతో రైలు వ్యాగన్ల కర్మాగార నిర్మాణానికి, రూ.2,147 కోట్లతో జగిత్యాల-కరీంనగర్-వరంగల్ జాతీయరహదారి పనులకు, రూ.3,441 కోట్లతో మంచిర్యాల-వరంగల్ జాతీయరహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన విజయసంకల్ప సభలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి కోసం పలు రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయని, కానీ అవినీతి కోసం తెలంగాణ, ఢిల్లీ ప్రభుత్వాలు కలిసి పనిచేయడం తొలిసారిగా చూస్తున్నానన్నారు. కెసిఆర్ కుటుంబ అవినీతిపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయని చెప్పారు. కెసిఆర్‌కు కేవలం నాలుగు పనులే తెలుసన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మోడీని తిట్టడం, కుటుంబ పార్టీని పెంచి పోషించడం, తెలంగాణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడం, తెలంగాణను అవినీతిలో కూరుకుపోయేలా చేయడమని విమర్శించారు. టిఎస్‌పిఎస్‌సి కుంభకోణంతో నిరుద్యోగుల ఆశలను వమ్ము చేశారన్నారు. ఇలాంటివి చూసేందుకేనా యువత బలిదానాలు చేసింది? అంటూ ప్రశ్నించారు. అవినీతిపై దృష్టి సారించకుండా ప్రజల దృష్టిని కెసిఆర్ మళ్లిస్తున్నారని విమర్శించారు. దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకమైందన్నారు. ప్రపంచ దేశాలకు హైదరాబాద్‌లోనే వ్యాక్సిన్ రూపొందించి అందించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. తొమ్మిదేండ్లలో రాష్ట్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామని వివరించారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్ రెడ్డి, బండి సంజయ్, పలువురు ప్రజా ప్రతినిధులు సభలో పాల్గొన్నారు.

అవినీతి నాయకులపై చర్యలు తీసుకోండి : మోడీకి శరద్ పవార్ విజ్ఞప్తి

ముంబయి: అవినీతి నాయకులపై చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఎన్‌సిపి నాయకులు శరద్ పవార్ విజ్ఞప్తి చేశారు. ఎన్‌సిపి నుంచి చీలిపోయిన కొంత నేతలను ఉద్దేశించి శరద్‌పవార్ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో ఎన్‌సిపి నేతలపై ప్రధానమంత్రి స్వయంగా అవినీతి ఆరోపణలు చేశారని శరద్ పవార్ గుర్తు చేశారు. ప్రభుత్వ యంత్రాంగం అంతా ప్రధానమంత్రి చేతుల్లోనే ఉన్నందున సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం నాసిక్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో శరద్ పవార్ ఈ విధంగా ప్రసంగించారు. ఎన్‌సిపిలో చీలిక తెచ్చి అజిత్ పవార్. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో చేరిన సంగతి తెలిసిందే. దీంతో పార్టీని తిరిగి నిర్మిస్తానని శరద్ పవార్ శపథం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర పర్యటనకు ఆయన శ్రీకారం చుట్టారు. అజిత్ పవార్ గ్రూపులోని ఛగన్ భుజ్‌బల్ సొంత నియోజకవర్గమైన యోలా నియోజకవర్గంలో బహిరంగసభలో ప్రజలనుద్దేశించి శరద్‌పవార్ మాట్లాడారు. "భోపాల్‌లో బిజెపి బూత్ స్థాయి వర్కర్ల సమావేశంలో ప్రధాని మోడీ ఎన్‌సిపి నేతలపై అవినీతి ఆరోపణలు చేశారు. రూ.70 వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారన్నారు. ఇప్పుడు వారిపై చర్యలు తీసుకోవాలని ప్రధానిని కోరుతున్నా' అని శరద్ పవార్ అన్నారు. అలాగే , తన వయసు గురించి ఇంకోసారి ఎవరూ మాట్లాడొద్దని శరద్ పవార్ హెచ్చరించారు. పార్టీ కార్యకర్తల కోసం చివరి వరకు పని చేస్తానని చెప్పారు. కొందర్ని నమ్మి తాను తీవ్రంగా మోసపోయానంటూ భుజ్‌బల్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు.

ఆలయ అర్చకులుగా అన్ని కులాలవారు డిఎంకె తెచ్చిన సామాజిక న్యాయం : స్టాలిన్

చెన్నై : ఏ కులానికి చెందిన వారినైనా ఆలయ అర్చకులుగా నియమించడం రాష్ట్రంలో డిఎంకె తీసుకొచ్చిన సామాజిక న్యాయమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పేర్కొన్నారు. చెన్నైలో ఇటీవల హిందూ రిలిజియస్ అండ్ చారిటబుల్ ఎండోమెంట్స్ (హెచ్‌ఆర్‌అండ్‌సిఇ) శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని దేవాలయాల తరపున 34 జంటలకు జరిగిన సామూహిక వివాహ వేడుక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ఆలయ అర్చకులుగా ఏ కులానికి చెందిన వారైనా ఉండొచ్చని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం డిఎంకె ప్రభుత్వం ఈ సామాజిక న్యాయాన్ని తీసుకుని వచ్చింది' అని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్కర్నీ ఆలయాల్లో అర్చకులుగా అనుమతించే 'ద్రావిడ మోడల్' ప్రభుత్వమే, నిజమైన సామాజిక న్యాయమని స్టాలిన్ చెప్పారు. తమిళనాడు స్ఫూర్తితో రాజస్థాన్ ప్రభుత్వం కూడా వివిధ ఆలయాల్లో ఎనిమిది మంది మహిళలతో సహా మొత్తం 17 మందిని అర్చకులుగా నియమించిందని స్టాలిన్ తెలిపారు. అలాగే, హిందూ దేవాలయాల నిర్వహణ కోసం హెచ్‌ఆర్‌అండ్‌సిఇ శాఖను సృష్టించింది కూడా తమ జస్టిస్ పార్టీ అని స్టాలిన్ గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ శాఖ రాష్ట్రంలో 43 వేల ఆలయాల నిర్వహణను పర్యవేక్షిస్తుందని తెలిపారు. పురాతన ఆలయాల నిర్మాణాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పునర్నిర్మాణం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌అండ్‌సిఇ మంత్రి పికె శేఖర్‌బాబు, ఉన్నత విద్యాశాఖ మంత్రి కె. పొన్ముడి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మా. సుబ్రమణియన్, మైనారిటీల సంక్షేమం- ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి జింగీ కెఎస్ మస్తాన్, చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాష్టీకం

- మరో ఇద్దరు పాలస్తీనియన్ల కాల్చివేత

నబ్లస్ : ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌పై దాడి చేసి అనేక మందిని కాల్చి చంపిన ఇజ్రాయిల్ తాజాగా మళ్లీ విరుచుకుపడింది. ఇజ్రాయిల్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు పాలస్తీనియన్లు మృతి చెందారు.. ఇరు పక్షాల మధ్య హింస పెచ్చరిల్లకుండా వుండేందుకు అర్థవంతమైన రాజకీయ క్రమం చేపట్టాలంటూ ఐక్యరాజ్య సమితి విజ్ఞప్తి చేసిన మరుసటి రోజే ఈ దాడి జరిగింది. వెస్ట్ బ్యాంక్ ఉత్తర ప్రాంత నగరమైన నబ్లస్‌పై ఇజ్రాయిల్ మిలటరీ దాడి సందర్భంగా కాల్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా ఇద్దరు మరణించగా, ముగ్గురు గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. తమ సైనికులు కూడా గాయపడ్డారని ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. శుక్రవారం ఉదయం నబ్లస్‌లోకి ప్రవేశించిన ఇజ్రాయిల్ బలగాలు పాత సిటీలోని ఒక ఇంటిని చుట్టుముట్టాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. జెనిన్ పట్టణంపై దాడులకు ప్రతీకారంగా గురువారం పాలస్తీనా యోధుడు నబ్లస్ సమీపంలో ఇజ్రాయిల్ సైనికుడిని కాల్చి చంపారు. ఆ దాడికి ప్రతి దాడిగా శుక్రవారం నాటి కాల్పులు జరిగాయి.

బాదుడే బాదుడు

(మొదటి పేజీ తరువాయి)

రూ.5.91 పైసలు చొప్పున రూ.10,04,700 బిల్లు వచ్చింది. అలాగే 1440 కిలోవాట్స్‌కు కనెక్షన్‌కు వాట్‌కు రూ.475 చొప్పున సుమారు రూ.6,84,000 బిల్లు వచ్చింది. మొత్తం నెల బిల్లు రూ.16,88,700 కట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం ఎలక్ట్రిసిటీ డ్యూటీ యూనిట్‌కు రూపాయి పెంచడంతో రూ.1.70 లక్షలు అదనపు భారం పడింది. పవర్‌ఫ్యాక్టర్ లీడ్‌ను(మెయింటెయిన్ చేయాల్సిన సరఫరా కంటే ఎక్కువ) కూడా రికార్డు చేయడంతో రూ.4,80,000 అదనంగా బిల్లు వేశారు. దీంతో పరిశ్రమల యజమానులు రాష్ట్రంలో నడపలేకపోతున్నామని, పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకకు యూనిట్లు మార్చుకోవడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని చెబుతున్నారు.

పరిశ్రమలపై ఒత్తిడి

ప్రస్తుతం పరిశ్రమలు తయారు చేసే ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించి ముందుగానే ఖర్చు తదితర అంశాలను లెక్కకట్టి పెద్దపెద్ద కంపెనీలతో అగ్రిమెంటు చేసుకుంటారు. అయితే ఇప్పటికిప్పుడు పడుతున్న ట్రూఅప్, పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్, పవర్ ఫ్యాక్టర్, కిలోవోల్ట్ అవర్ వంటివేమీ వాటిల్లో ఉండవు. గతంలో ఉన్న ఖర్చుల ఆధారంగా అగ్రిమెంటు చేసుకున్న పరిశ్రమ యజమాని అదే ధరకు తయారు చేసి ఒప్పంద సమయంలోపు అందించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో అగ్రిమెంటు చేసుకున్న సంస్థలు జరిమానాలు విధిస్తాయి. పాత లెక్కల ప్రకారం వస్తువులు తయారు చేస్తే యజమానులు నష్టపోవడం తప్ప మరొకటి ఉండదు. ఒక అగ్రిమెంటుకు రూ.4 లక్షలు మిగులుతాయనుకుంటే అదనపు కరెంటు బిల్లులే రూ.5 లక్షలు ఉంటున్నాయి. అదనంగా చేతిలో డబ్బులు పెట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కన్నవారే కసాయిలౌతారా?

బుజ్జాయి తప్పటడుగులు వేస్తుంటే తల్లిదండ్రులు తెగ మురిసిపోతారు. పడుతూ లేస్తూ వస్తున్న పాపాయి చేయి పట్టుకుని నడిపిస్తారు. కంటికి రెప్పలా కాపాడుకున్న ఆ పసిది పెరిగి పెద్దై తన తోడు వెతుక్కుంటే మాత్రం ఆ తల్లిదండ్రులు సహించలేరు. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్ల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు ఎక్కడో ఉత్తర భారతదేశంలో తల్లిదండ్రులకు ఇష్టం లేని కులం కానివారిని పెళ్లి చేసుకున్న కూతుర్లను పరువు పేరుతో హతమార్చే ఘటనలు వెలుగుచూసేవి. ప్రస్తుతం దక్షిణాదిలో మన తెలుగురాష్ట్రాల్లో ఈ రకమైన అమానుష కృత్యాలు చాపకింద నీరులా పెరిగిపోతున్నాయి.

పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేసే తల్లిదండ్రులు వారు కోరుకున్న భాగస్వామిని ఎందుకు అంగీకరించలేకపోతున్నారు? సాధారణంగా చిన్నప్పుడు పిల్లలు తమకి నచ్చనివాటి విషయంలో చాలా స్పష్టంగా ఉంటారు. ఉదాహరణకు 'నాకిది ఇష్టం లేదు.. నాకిది వద్దు' అని నిర్మోహమాటంగా చెబుతుంటారు. అప్పుడు పెద్దలు కూడా వారి ఇష్టాయిష్టాలను గమనిస్తూ.. వారిని సంతోషపెట్టడానికే చూస్తారు. అదే పిల్లలు కాస్త పెద్దై కౌమారంలోకి వచ్చాక కూడా అదే ధోరణిలో ఉంటే మాత్రం చాలా మంది పెద్దలు వారిని నియంత్రించడానికి చూస్తారు. దండించైనా సరే వారిని దారిలోకి తేవాలనుకుంటారు.

సమాజం.. ప్రభావం..

మనకు తెలియకుండానే సమాజ ప్రభావం మనమీద పడుతుంది. పిల్లల పెంపకం, చదువు, పెళ్లి వంటి విషయాలు సమాజ ధోరణికి అద్దం పట్టేలా ఉంటాయి. ఫలానా పిల్లలు ఫలానా స్కూల్లో చదువుతుంటే మన పిల్లలు కూడా ఆ స్కూల్లో చదివించాలని, స్థోమత ఉన్నా లేకున్నా అన్ని వసతులు కల్పించాలని ప్రతి తల్లిదండ్రీ కలలు కంటారు. నలుగురినీ చూసి ఆచరించడం, వారు చేసే పనులను అనుసరించడం సాధారణంగానే ఒక అలవాటుగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలోనే ఒక వయసు వచ్చాక పిల్లలు ఎదురు తిరిగినప్పుడు పిల్లలను సరిగ్గా పెంచడం లేదని సమాజంలో తమ పరువు పోతుందని చాలా కంగారు పడిపోతాం. వారిని దారిలోకి తేవాలని తెగ ఆరాటపడిపోతాం. మాట వినని పిల్లలున్న తల్లిదండ్రులకు అదో పెద్ద ఆందోళన..

నియంత్రించుకోలేని భావోద్వేగ స్థాయిలు

బాధ, సంతోషం, దు:ఖం, కష్టం మాదిరే.. ఒత్తిడి, బాధ్యత, ఆందోళన, నిరాశలు కూడా మనలో కలిగే రకరకాల భావోద్వేగాలు. పిల్లల పెంపకంలో ప్రతి తల్లీదండ్రీకీ అవన్నీ అనుభవంలోకి వచ్చేవే.. ఆ భావోద్వేగాలనే రకరకాల పద్ధతుల్లో పిల్లలపై వ్యక్తపరుస్తుంటారు. అలాంటి భావోద్వేగమే ప్రేమ పెళ్లి చేసుకున్న పిల్లలను అంగీకరించలేకపోవడం. ఇది ఒక్కొక్కరిలో ఒక్కోలా బయటపడుతుంది. చాలామందిలో పిల్లలు చేసుకున్న పెళ్లిళ్ల ఇష్టం లేనప్పుడు కుటుంబానికి వారికి దూరంగా పెట్టడం, వారికీ కుటుంబానికి సంబంధం లేదని తెగేసి చెప్పడం జరుగుతుంటుంది. పెళ్లి వారి కుటుంబానికి సంబంధించిన వ్యవహారంగా తల్లిదండ్రులు భావించినప్పుడు జరిగే సాధారణ ఘటనలు ఇవి.. అదే వ్యవహారం సమాజానికి అనుసంధానం చేసుకున్న తల్లిదండ్రులు వారి భావోద్వేగాలను నియంత్రించుకోలేరు. తమ పరువు తీసిందని, తలెత్తుకుని తిరగకుండా చేసిందని పగ పెంచుకుంటారు. అప్పటి వరకు అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లను నరికి చంపడానికి కూడా వెనకాడటం లేదు. కన్నవారే కర్కశులుగా మారిన వైనాలు ఈ మధ్య కాలంలో తెలుగు రాష్ట్రాల్లో వెలుగు చూస్తున్నాయి.

2014 నుండి 2016 మధ్య కాలంలో దేశంలో 356 పరువు హత్యలు వెలుగుచూశాయని గతంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నివేదిక పేర్కొంది. 'చట్టం లేనందున చాలా కేసులు హత్య లేదా ఐపిసి ఇతర నిబంధనల కింద నమోదు చేస్తున్నారు. పరువు హత్యలుగా నమోదయ్యేవి చాలా తక్కువ. గౌరవం పేరుతో జరిగే ఈ హత్యలకు సంబంధించిన డేటాను సమగ్రంగా అధ్యయనం చేయాలి. జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ప్రత్యేకమైన డేటాబేస్ రూపొందించా'లని 2014 నుండి పరువు హత్య' పేరుతో నమోదైన నేరాలపై అధ్యయనం చేస్తున్న నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో పేర్కొంటోంది.

వరుస ఘటనలు..

2023 జూన్ 16న కర్నూలు జిల్లా పెదకదుబ్బూర్ మండలంలో ఒక కుటుంబంలో పెద్ద కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడం ఇష్టం లేని తల్లిదండ్రులు ఆమె బతికుండగానే శ్రాద్ధకర్మలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులను ఆహ్వానించి నిర్వహించిన ఆ కార్యక్రమాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ ఘటన వెలుగు చూసింది. తెలంగాణలో కూడా ఈ తరహా ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి బయటికి వచ్చింది.

2019 అక్టోబరు నెల.. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలో ఇంటర్ చదువుతున్న కూతురు కులాంతర వివాహం చేసుకుందని తెలిసి కన్నతండ్రే ఆమెను ఉరి వేసి చంపాడు. పెళ్లి నాటికి కూతురు మైనర్ కావడంతో, ఏడాది తరువాత అత్తింటికి పంపిస్తానని నమ్మబలికి ఆమెను ఇంటికి తీసుకొచ్చాడు. ఓ తాడుతో గొంతు చుట్టూ మెలిపెట్టి చంపేసి ఉరి వేసుకుందని చెప్పాడు. రాత్రికి రాత్రే శవాన్ని కాల్చేసి బూడిదను బస్తాల్లో కుక్కి ఓ మురికి కాల్వలో కలిపేశాడు!

2020 జూన్ నెల.. తెలంగాణ జోగులాంబ గద్వాల్ మండలంలో తమ కుమార్తె వేరే కులానికి చెందిన అబ్బాయిని ప్రేమించి, అతని బిడ్డకు తల్లి అవుతోందని తెలుసుకున్న తల్లిదండ్రులు రాత్రికి రాత్రే ఆ బిడ్డను హతమార్చారు. తల్లి, దిండుతో ముఖంపై అదిమి పెట్టగా.. తండ్రి, కూతురు మెడను తాడుతో మెలేశాడు. కాళ్లు, చేతులు కొట్టుకుంటూ, ఊపిరాడక మరణించిన కూతురును అదే తాడుతో ఉరివేసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారు ఆ తల్లీదండ్రీ.

2021 జనవరి 1న కర్నూలు జిల్లా ఆదోనిలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిపై కొంతమంది వ్యక్తులు ఇనుప రాడ్లతో తీవ్రంగా కొట్టి చంపారు. తన పుట్టింటి వారే ఈ దారుణానికి పాల్పడ్డారని అతని భార్య చెప్పింది. కారణం.. ఆమె వారికి ఇష్టం లేని పెళ్లి చేసుకోవడమే!

... ఇలా ఏడాదికేడాది ఈ తరహా ఘటనలు తెలుగు రాష్ట్రాలో పెరిగిపోతున్నాయి. వెలుగుచూసిన ఘటనలు చాలా తక్కువ. ఉనికిలోకి రానివి చాలానే ఉన్నాయి. పరువు పోతుందని బిడ్డను చంపడమో.. ఆమె భర్తను హతమార్చడమో చేసేందుకు తల్లిదండ్రులు వెనుకాడడం లేదు. ప్రాణంగా పెంచుకున్న బిడ్డలను ఇంత కిరాతకంగా చంపేంత కర్కశత్వం తల్లిదండ్రుల్లో ఎలా వస్తోంది?

కుల దురహంకార హత్యలివి ..

గతంలో మన రాష్ట్రంలో ఇటువంటి దారుణాలు జరగలేదు. కూతురు వేరే కులం వాడిని పెళ్లి చేసుకుంటే ఆమె కుటుంబ సభ్యులు తనతో తెగతెంపులు చేసుకునేవారు. ఇప్పుడు పరిస్థితి అలా లేదు. ఉత్తరాదిలో వేళ్లూనుకున్న ఈ తరహా హత్యలు చాపకింద నీరులా ఇక్కడికి కూడా వ్యాపించాయి. కూతురు కులాంతర వివాహం చేసుకుంటే పెత్తందార్లం అనుకునేవాళ్లు ఆమెనో.. ఆమె భాగస్వామినో చంపేదాకా ఊరుకోవడం లేదు. సమాజంలో కుల ఉన్మాదం ఎంత తీవ్ర స్థాయిలో ఉందోననడానికి ఇటువంటి ఘటనలే ఉదాహరణ. పరువు, గౌరవ హత్యలని వీటిని పిలవకూడదు.. కుల దురహంకార హత్యలుగా చూడాలి. దీనికి ప్రత్యేక చట్టం రావాలి. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- డి.రమాదేవి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి.

అల్లరి కోతి

ఒక చెరువు వద్ద ఇద్దరు జాలరులు చేపలు పట్టుకుంటున్నారు. వలలో పడిన చేపలను పక్కనే వున్న బుట్టలో వేసుకొని తిరిగి వలను చెరువులోకి విసురుతున్నారు. ఆ చెరువు పక్కనే వున్న చెట్టుపై కూర్చోని వున్న ఒక కోతి ఇదంతా గమనిస్తోంది. జాలర్ల లాగే తనకూ చేపలు పట్టడం నేర్చుకోవాలనిపించింది. మధ్యాహ్నం అవుతూనే జాలర్లు వలను చెరువులోకి విసిరి చెట్టు కింద నీడలో కూర్చోని భోజనానికి ఉపక్రమించారు. భోజనం అయ్యాక ఎండ తీవ్రత ఎక్కువగా వుండడం వల్ల చెట్టు నీడన కునుకు తీయసాగారు.

ఆ సమయంలో కోతి నెమ్మదిగా చెట్టు దిగి చెరువు గట్టుకు వచ్చి ఆ వలను అటూ ఇటూ ఊపసాగింది. వల బరువుగా అనిపించడంతో తన బలాన్నంతటినీ ఉపయోగించి ఊపసాగింది. ఈ క్రమంలో పట్టు తప్పి, కాలు జారి వలపై పడిపోయింది. కోతి బరువుకు వల కిందకు కుంగగా కోతి చెరువులో మునిగిపోసాగింది. హఠాత్తుగా ముంచుకొచ్చిన ఆ ఉపద్రవానికి కోతి భయపడిపోయింది. గట్టిగా అరుస్తూ ఉంది. కోతి అరుపులకు జాలర్లకు మెలకువ వచ్చింది. నీటిలో మునిగిపోతున్న కోతిని రక్షించేందుకు గబ గబ చెరువు గట్టుకు వెళ్ళి వలను బలంగా లాగారు. కోతి ఒడ్డున పడింది. తనను ఆపద నుండి రక్షించినందుకు వారికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు కిచకిచమని అరిచి వేగంగా గెంతుతూ దూరంగా పారిపోయింది. ఈ సంఘటనతో తనకు తెలియని పనులలో అనవసరంగా వేలెట్టకూడదని, ఏదైనా పని చేయాలనుకుంటే ముందు దాని గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ఆ కోతి అనుభవపూర్వకంగా తెలుసుకుంది.

- సిహెచ్. ప్రతాప్
హైదరాబాద్.

e p ar	
ota moo	
am gon	
top aot	
twelo arnem	
oin no	
apine lplep	
nto cuco	

సరి చేయండి

పిల్లలూ ఇక్కడ కొన్ని పండ్లు, వాటికెదురుగా గజిబిజిగా కొన్ని అక్షరాలు ఇచ్చాం. వాటిని సరైన క్రమంలో రాస్తే ఆ పండ్ల పేర్లు వస్తాయి. ట్రై చేయండి మరి..

నేను గీసిన బొమ్మ

చల్లా దివ్యశ్రీ,
1వ తరగతి,
వివేకానంద హైస్కూల్,
పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సెమీస్‌కు సింధు, లక్ష్యసేన్

కెనడా ఓపెన్ సూపర్-500

కాల్గరీ(కెనడా): కెనడా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి భారత షట్లర్లు పివి సింధు, లక్ష్యసేన్ దూసుకెళ్లారు. శుక్రవారం రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో రెండుసార్లు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన పివి సింధు21-13, 21-7తో ఫాంగ్ జియో(జపాన్)పై వరుససెట్లలో నెగ్గింది. ఇంతకుముందు నాలుగుసార్లు ఫంగ్-జితో తలపడి ఓడిన సింధు.. తొలిసారి విజయం సాధించడం విశేషం. సెమీస్‌లో సింధు.. ప్రపంచ నంబర్ వన్ క్రీడాకారిణి, జపాన్‌కు చెందిన యమగుచితో తలపడనుండి. 28ఏళ్ల హైదరాబాద్‌కు చెందిన సింధు ముఖాముఖి పోరులో జపాన్ టాప్‌సీడ్ యమగుచిపై 14-10 రికార్డును కలిగి ఉండడం కలిసి రానుంది. ఇక పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో యువ షట్లర్ లక్ష్యసేన్ 21-8, 17-21, 21-10తో జులియన్ కర్రగి(జర్మనీ)పై చెమటోడ్చి నెగ్గాడు. సెమీస్‌లో లక్ష్యసేన్ 4వ సీడ్, జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటోతో తలపడనున్నాడు. లక్ష్యసేన్-నిషిమోటో మధ్య ముఖాముఖి రికార్డు 1-1తో సమంగా ఉంది.

ఫైనల్‌కు సౌత్, వెస్ట్‌జోన్ జట్లు

మళ్లీ మెరిసిన మయాంక్ అగర్వాల్
దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లోకి సౌత్, వెస్ట్‌జోన్ జట్లు ప్రవేశించాయి. చిన్నస్వామి స్టేడియంలో నార్త్‌జోన్‌తో జరుగుతున్న సెమీస్‌లో సౌత్ జోన్ జట్టు 2వికెట్ల తేడాతో, ఆలూరు కస్కా క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న మరో సెమీస్‌లో వెస్ట్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో సెంట్రల్‌జోన్ జట్టుపై గెలిచాయి. నార్త్‌జోన్ నిర్దేశించిన 215పరుగుల లక్ష్యాన్ని సౌత్‌జోన్ జట్టు 36.1 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓవర్‌నైట్ స్కోర్ 20పరుగులతో శనివారం చివరిరోజు ఆటను కొనసాగించిన సౌత్‌జోన్‌ను మయాంక్ అగర్వాల్(54), కెప్టెన్ హనుమ విహారి(43), రికీ బుయ్(34), తిలక్ వర్మ(25) బ్యాటింగ్‌తో ఆదుకున్నారు. టి విరామం తర్వాత వర్షం కారణంగా కొంతసేపు ఆటకు అంతరాయం కలిగినా.. ఆ తర్వాత సౌత్‌జోన్ బ్యాటర్స్ ధీటుగా ఆడారు. నార్త్‌జోన్ బౌలర్లు హర్షిత్ రాణాకు మూడు, బల్జీత్ సింగ్, వైభవ్ అరోరాకు రెండేసి వికెట్లు దక్కాయి.

వెస్ట్‌జోన్ రికార్డుస్థాయిలో 34వ సారి...

ఆలూరు కస్కా స్టేడియంలో జరుగుతున్న మరో సెమీస్‌లో సెంట్రల్‌జోన్ జట్టుపై వెస్ట్‌జోన్‌పై గెలిచింది. వెస్ట్‌జోన్ జట్టు నిర్దేశించిన 390పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చివరిరోజు బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు వర్షం కారణంగా మ్యాచ్ నిలిచే సమయానికి 35ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 128పరుగులు చేసింది. దీంతో ఈ మధ్య మ్యాచ్ డ్రా అయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్ట్‌జోన్ జట్టు 220పరుగులు, సెంట్రల్ జోన్ జట్టు 128పరుగులు చేశాయి. దీంతో వెస్ట్‌జోన్ జట్టు రికార్డుస్థాయిలో 34వ సారి ఫైనల్లోకి ప్రవేశించింది. వెస్ట్‌జోన్ జట్టు ఇప్పటివరకు రికార్డుస్థాయిలో 19సార్లు టైటిల్‌ను చేజిక్కించుకుంది. వెస్ట్-సౌత్‌జోన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ బుధవారం(12న) జరగనుంది.

మై డియర్ మార్కండేయ..

సాయి ధరమ్ తేజ్ హీరోగా పవన్ కళ్యాణ్ గెస్ట్ రోల్‌లో నటించిన 'బ్రో ది అవతార్' చిత్రం నుండి తాజాగా ఫస్ట్ సాంగ్ విడుదలైంది. సముద్రఖని దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా నుంచి 'మై డియర్ మార్కండేయ' అంటూ సాయి ధరమ్ తేజ్, పవన్ లపై డిజైన్ చేసిన ఈ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటలో ఊర్వశి రౌతేలా కూడా కనిపిస్తున్నారు. థమన్ అందిస్తున్న ఈ చిత్రానికి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణం వహిస్తోంది. ఈ నెల 28న ఈ సినిమా రిలీజ్ కానుంది.

రెండో షెడ్యూలు పూర్తి

కృష్ణ చైతన్య దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై త్రివిక్రమ్ శ్రీనివాస్ భార్య సౌజన్య, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రంలో విశ్వక్ సేన్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ మొదలైన ఈ చిత్రం రెండవ షెడ్యూల్ పూర్తి చేసుకుందని తాజాగా విశ్వక్ సేన్ సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు.

డెవిల్ టీజర్ వచ్చేసింది !

'మనసులో ఉన్న భావన ముఖంలో తెలియకూడదు. మెదడులో ఉన్న ఆలోచన మాటల్లో బయటపడకూడదు అదే గూఢచారికి ఉండాల్సిన ముఖ్య లక్షణం' అంటున్నారు నందమూరి కల్యాణ్‌రామ్. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'డెవిల్'. నవీన్ మేడారం దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ చిత్రం నుండి తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ కథాంశంతో పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది. టీజర్‌లో బ్రిటీష్ గూఢచారిగా కల్యాణ్‌రామ్ కనిపించారు. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ కథానాయకగా నటిస్తోంది.

హైద్రాబాద్‌లో 'గుంటూరు కారం'

మహేష్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రంలో తాజాగా హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సెట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రీకరణలో మహేశ్‌తో పాటు ఇతర ప్రధాన తారాగణంపై ఓ ఫైట్‌ను తెరకెక్కించనున్నారు. దీని కోసం మహేశ్ ఇప్పటికే ప్రత్యేకంగా సిద్ధమైనట్లు సమాచారం. టైటిల్‌కు తగ్గట్లుగానే గుంటూరు నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ చిత్రమిది. ఎస్.రాధాకృష్ణ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. సంక్రాంతి సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 13న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

కార్న్‌వాల్

తొలిటెస్ట్‌కు కార్న్‌వాల్

జట్టును ప్రకటించిన కరేబియన్ బోర్డు

బార్బొడాస్: భారత్‌తో జరిగే తొలిటెస్ట్‌కు వెస్టిండీస్ జట్టులో బాహుబలి కార్న్‌వాల్‌కు చోటు దక్కింది. కరేబియన్ బోర్డు భారత్‌తో తొలి టెస్టులో ఆడే 13మంది ఆటగాళ్ల జాబితాలను శుక్రవారం రాత్రి ప్రకటించగా... కెప్టెన్‌గా క్రెగ్ బ్రాట్‌వైట్‌కు పగ్గాలు దక్కాయి. మరో ఇద్దరు బ్యాట్స్‌మెన్లు అథనాజ్, మెకంజీలు తొలిసారి జట్టులో స్థానం దక్కించుకున్నారు. కాగా, రకీం కార్న్‌వాల్ 2021 తర్వాత ఆడనున్నాడు. ఆల్‌రౌండర్ అయిన రకీం.. 2019లో భారత జట్టుపైనే ఆరంగేట్రం చేయడం విశేషం. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ట్వీకర్ జోమెల్ వారికన్‌కు జట్టులో స్థానం కల్పించారు. వీరితోపాటు రిజర్వ్ ఆటగాళ్లుగా టెవిన్ ఇమ్లాచ్, అకీమ్ జోర్డాన్ ఉన్నారు. ఈ నెల 12 నుంచి భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది.

తొలి టెస్టుకు విండీస్ జట్టు: బ్రాత్‌వైట్ (కెప్టెన్), బ్లాక్‌వుడ్ (వైస్ కెప్టెన్), అథనాజ్, చందర్‌పాల్, కార్న్‌వాల్, జాషువా డా సిల్వా, గాబ్రియేల్, హోల్డర్, జోసఫ్, కిర్క్ మెకంజీ, రేమన్ రీఫర్, రోచ్, వారికాన్.

జకో @ 350వ విజయం

గ్రాండ్‌స్లామ్ సింగిల్స్‌లో అత్యధిక విజయాలతో రికార్డు



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్లోకి 2వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. మూడో రౌండ్‌లో జకోవిచ్ 6-3, 6-1, 7-6 (7-5)తో అన్‌సీడెడ్ వావ్రింకా(స్విట్జర్లాండ్)పై విజయం సాధించాడు. ఈ గెలుపులో గ్రాండ్‌స్లామ్ టోర్నీ సింగిల్స్‌లో 350కు పైగా విజయాలు సాధించిన ఏకైక ఆటగానిగా జకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. ప్రి క్వార్టర్స్‌లో జకోవిచ్.. యువ ఆటగాడు హుర్కోరాజ్‌తో తలపడనున్నాడు. మరో పోటీలో 3వ సీడ్ మెద్వదెవ్(రష్యా) 4-6, 6-3, 6-4, 6-4తో ఫుస్కోవిస్క్(హంగేరీ)పై, 8వ సీడ్ జన్నిక్ సిన్నర్ 3-6, 6-2, 6-3, 6-4తో క్వెంటిన్ హయల్స్‌పై గెలిచి ప్రి క్వార్టర్స్‌కు చేరాడు. సిట్సిపాస్ 7-6(7-3), 6-7(2-7), 4-6, 7-6 (7-3), 6-4తో ఆండీ ముర్రే(బ్రిటన్)ను ఓడించి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లాడు.

ప్రి క్వార్టర్స్‌కు స్వైటెక్, క్విటోవా

మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్, 9వ సీడ్ క్విటోవా(చెక్ రిపబ్లిక్) ప్రి క్వార్టర్స్‌కు చేరారు. ఇగా స్వైటెక్ 6-2, 7-5తో మార్టిక్స్(క్రొయేషియా)పై క్విటోవా 6-3, 7-5తో స్టెవనోవిక్(సెర్బియా)ను ఓడించారు. ఇక 13వ సీడ్ హడ్డాడ్(బ్రెజిల్) 6-2, 6-2తో క్రిస్టియా(జర్మనీ)ను ఓడించగా.. 21వ సీడ్, రష్యాకు చెందిన అలెగ్జాండ్రోవా 6-0, 6-4తో గల్ఫీ (హంగేరీ)ని ఓడించి సంచలనం నమోదు చేశారు. 5వ గార్సియా(ఫ్రాన్స్) 6-7(0-7), 4-6, 5-7)తో బ్యోంజ్‌కోవా(చెక్) చేతిలో ఓడింది.

రిటైర్మెంట్‌పై వెనక్కి తగ్గిన తమీమ్

ఢాకా: బంగ్లాదేశ్ వన్డే కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటనలో.. రిటైర్మెంట్ ప్రకటన అనంతరం ప్రధాని తనను ఇంటికి ఆహ్వానించి, మళ్లీ ఆడమని కోరారని, దీంతో తాను రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు మీడియాతో తెలిపాడు. రిటైర్మెంట్ నిర్ణయంపై తాను ఎవరికైనా సమాధానం చెప్పగలను గానీ దేశ ప్రధాని పిలిచి రిటైర్మెంట్ నిర్ణయంపై పునరాలోచన చేయమని కోరడంతో.. ఆమె నిర్ణయాన్ని గౌరవిస్తూ మళ్లీ క్రికెట్ బ్యాట్ పట్టనున్నట్లు తమీమ్ ఇక్బాల్ తెలిపాడు.

పొరబాటును అంగీకరిస్తున్నా ...

భారీ అంచనాల మధ్య విడుదలై అభిమానులను తీవ్రంగా నిరాశపరచిన 'ఆదిపురుష్' చిత్రంలో ఎన్నో లోపాలు ఉన్నాయని చిత్ర బృందంపై మొదటి నుండి ఎన్నో ఆరోపణలు వచ్చాయి. హనుమంతుడికి సంబంధించిన సంభాషణలు సరిగ్గా లేవని, తక్షణమే ఆ సంభాషణలు మార్చాలని డిమాండ్ వచ్చిన నేపథ్యంలో చిత్ర బృందం కొన్ని సన్నివేశాల్లో మార్పులు కూడా చేశారు. తాజాగా ఈ చిత్ర డైలాగ్ రైటర్ మనోజ్ ముంతశిర్ క్షమాపణ కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ లేఖ పోస్ట్ చేశారు. 'ఆదిపురుష్' సినిమా వల్ల ప్రజల భావోద్వేగాలు దెబ్బతిన్నాయి. పెద్దలందరికీ చేతులు జోడించి క్షమాపణ కోరుతున్నా. జరిగిన పొరపాటును అంగీకరిస్తున్నా..' అంటూ రాసుకొచ్చారు.

పంచాయతి ఎన్నికలు 2023(పోటీ లేకుండా ఎన్నికైనవి)

గ్రామపంచాయతి		పంచాయతి సమితి		జిల్లా పరిషత్	
మొత్తం సీట్లు	పోటీలేకుండా ఎన్నికైనవి	మొత్తం సీట్లు	పోటీలేకుండా ఎన్నికైనవి	మొత్తం సీట్లు	పోటీలేకుండా ఎన్నికైనవి
63,229	6238	9,730	759	928	8

పోటీలేకుండా ఎన్నికైన మొత్తం సీట్లు: 7005
మొత్తం సీట్లు: 73,887

ఈ ఏడాది పోటీలేకుండా ఎన్నికైన సీట్ల శాతం 9.48

2018లో పోటీలేకుండా ఎన్నికైన సీట్ల శాతం - 34.2

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68